

ESTD : 1999

విజన్ ఆంధ్ర

తెలుగు దినపత్రిక

VISION ANDHRA TELUGU DAILY

ఉమ్మడి నల్గొండ జిల్లా

యాదాద్రి భువనగిరి, సూర్యాపేట, | శనివారం నవంబర్ 28,2026

కొమ్మరాజు అంజనేయులు కుటుంబానికి రూ.10 వేల ఆర్థిక సాయం

కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు గోలి పింగల్ రెడ్డి

బీబీనగర్:27/నవంబర్ (విజన్ ఆంధ్ర)



ఇటీవల మృతి చెందిన బీబీనగర్ పట్టణానికి చెందిన కొమ్మరాజు అంజనేయులు కుటుంబ సభ్యులను కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు గోలి పింగల్ రెడ్డి పరామర్శించి, ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఈ సందర్భంగా కుటుంబానికి అండగా నిలుస్తూ రూ. 10,000 ఆర్థిక సహాయాన్ని అందజేశారు. మృతుడి కుటుంబానికి అన్ని విధాలా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

సోషల్ మీడియా మోజులో పడి భవిష్యత్తును నాశనం చేసుకోవద్దు

బాల్యవివాహాలు,మాదకద్రవ్యాలు,గంజాయి,మైనర్ డ్రైవింగ్‌కు దూరంగా ఉండాలి...

నాగార్జునసాగర్ నియోజకవర్గ ప్రతినిధి,నవంబర్27(విజన్ ఆంధ్ర);



విద్యార్థులు సోషల్ మీడియాకు దూరంగా ఉంటూ చదువుపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులు సూచించారు. ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్ రీల్స్, వ్యక్తిగత వీడియోల మోజులో పడి విలువైన సమయాన్ని వృథా చేసుకోవద్దని, వాటికి బానిసలుగా మారకుండా భవిష్యత్తు లక్ష్యాలపై దృష్టి పెట్టాలని తెలిపారు.

అదేవిధంగా విద్యార్థులు మాదకద్రవ్యాలు, గంజాయి వంటి మత్తు పదార్థాలకు పూర్తిగా దూరంగా ఉండాలని సూచించారు. సరదా కోసం స్నేహితుల ప్రోత్సాహంతోనో, ఇతరుల మాటలు విని గంజాయి వంటి మత్తు పదార్థాలను ఒక్కసారి కూడా ప్రయత్నించకూడదని హెచ్చరించారు. గంజాయి వినియోగం వల్ల మెదడు పనితీరు దెబ్బతినడంతో పాటు జ్ఞాపకశక్తి తగ్గడం, ఆలోచనా శక్తి మందగించడం, చదువుపై ఏకాగ్రత కోల్పోవడం వంటి సమస్యలు ఎదురవుతాయని వివరించారు. క్రమంగా మత్తు పదార్థాలకు బానిసలై ఆరోగ్యంతో పాటు బంగారు భవిష్యత్తును కూడా నాశనం చేసుకునే ప్రమాదం ఉందని తెలిపారు. విద్యార్థులు అలాంటి అలవాట్లకు ఆకర్షితులు కాకుండా, ఎవరైనా మత్తు పదార్థాల వినియోగానికి ప్రోత్సహిస్తే దూరంగా ఉండాలని సూచించారు.

బాల్యవివాహాలు చేయడం చట్టరీత్యా నేరమని, బాలికలకు 18 సంవత్సరాలు, బాలురకు 21 సంవత్సరాలు నిండిన తర్వాతే వివాహాలు జరిపించాలని అవగాహన కల్పించారు. మైనర్లు వాహనాలు నడపడం కూడా చట్టరీత్యా నేరమని, డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపి ప్రమాదాల బారిన పడవద్దని హెచ్చరించారు.ప్రతి ఒక్కరూ ఆర్థిక స్వాతంత్ర్యం సాధించే దిశగా ముందుకు సాగాలని, తమ హక్కుల కోసం మనకోసమే మనం పోరాడాలని సూచించారు. అమ్మానాన్నలు లేని పిల్లలకు వివిధ విద్యాశాఖలకు సంబంధించిన విద్యాసంస్థల్లో ఉచిత సీట్లు కల్పించే అవకాశం ఉందని వివరించారు. విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉంటూ క్రమశిక్షణతో చదువుకొని ఉన్నత లక్ష్యాలను ఏర్పరచుకుని జీవితంలో మంచి స్థాయికి ఎదగాలని అధికారులు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో సీడీపీఓ విజయలక్ష్మి,సూపర్‌వైజర్ వెంకాయమ్మ, ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయురాలు రమాదేవి, మండల విద్యాధికారి తరి రాములు,ఐసీడీఎస్ అధికారి మహేష్,ఉపాధ్యాయ బృందం,విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక భద్రతకు భరోసా ఆసరా పింఛన్లు...

ఒంటరి మహిళలు, వితంతువులు, దివ్యాంగులకు ఆసరా పింఛన్ల పత్రాల పంపిణీ సర్పంచ్..

పగడాల పున్నమ్మ సైదులు యాదవ్

తిరుమలగిరి(సాగర్),నవంబర్ 27 (విజన్ ఆంధ్ర)



తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన చేయుత పెన్షన్లను అర్హులైన లబ్ధిదారులకు అందించడమే లక్ష్యంగా చేయూత పెన్షన్ పత్రాలు పంపిణీ ని సర్పంచ్ పగడాల పున్నమ్మ,సైదులు యాదవ్ గ్రామ పంచాయతీ ఆవరణంలో గ్రామపంచాయతీ పాలకవర్గ సమక్షంలో పెన్షన్ పొందిన లబ్ధిదారులకు పత్రాలను అందజేశారు.ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ సమాజంలో పేదలు, వృద్ధులు, వితంతువులు, వికలాంగులు, ఒంటరి మహిళలు ఇతర అర్హులైన వర్గాలకు ఆర్థిక భరోసా కల్పించడంలో పెన్షన్లు ఎంతో దోహదపడతాయని అన్నారు. పెన్షన్ ద్వారా లబ్ధిదారులకు ప్రతినెల ఆర్థిక సాయంతో పాటు అవసరాలకు భరోసా లభిస్తుందని అన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ పథకాలు అందేలా కృషి చేస్తామని అన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు.ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ ఇరిగి తిరుపతమ్మ, శ్రీను, పంచాయతీ కార్యదర్శి మోదాల శేఖర్,వార్డు మెంబర్లు పాత్ర వీణ భాస్కర్, జక్కిరెడ్డి పావని విజేందర్ రెడ్డి, పసుపులేటి కృష్ణ, పిట్టల మాధవి కృష్ణ, షేక్ రహీం,శాగం రాంరెడ్డి, కటికర్ల సౌందర్య సతీష్, సత్రశాల వెంకటయ్య, శివ ప్రసాద్, గ్రామస్తులు శాగం లింగారెడ్డి, నాగేండ్ల చిన్న భాస్కర్ రెడ్డి, షేక్ చాంద్ బాషా, పెద్దమాము ప్రశాంత్ మహిళలు, గ్రామపంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కష్టపడ్డా నాయకులను గుర్తిస్తాం .

ఏఐసీసీ ఇంచార్జ్ సందీప్ కుమార్.

సంస్థాన్ నారాయణపురం, నవంబర్ 27 విజన్ ఆంధ్ర:



కాంగ్రెస్ పార్టీ జెండా మోసిన ప్రతి నాయకుని గుర్తించి పార్టీ పదవుల్లో, నామినేటెడ్ పదవుల్లో న్యాయం చేయాలనీ కోరుతూ శుక్రవారం గాంధీ భవన్ లో తెలంగాణ ఏఐసీసీ ఇంచార్జ్ కీ యాదాద్రి భువనగిరి జిల్లా మాజీ కార్యదర్శి ఏపూరి సతీష్ వినతి పత్రం ఇచ్చి సన్మానం చేయడం జరిగింది. గత 30యేండ్ల రాజకీయ ప్రస్థానంలో బూత్ లెవల్ నుండి గ్రామ, మండల, జిల్లా స్థాయి లో పార్టీ కోసం చేసిన కార్యక్రమాలు, ఏఐసీసీ, టీపీసీసీ పిలుపు మేరకు చేసిన ఆదేశాలను విజయవంతం చేసిన ప్రోగ్రామలను ఒక్కొక్కటిగా ఫొటోలతో చూసి అభినందించారు. క్రమశిక్షణ తో పార్టీ కోసం పనిచేసే ప్రతి కార్యకర్తను నాయకులను తప్పకుండ గుర్తించి పీసీసీ అధ్యక్షులకు ఆదేశాలు ఇస్తానని అన్నారు. ప్రజా పాలన ప్రభుత్వంలో నీ సంక్షేమని ప్రజలకు తెలియజేయాలనీ మళ్ళీ రాష్ట్రంలో ప్రభుత్వాని తీసుకరావడానికి కృషి చేయాలనీ సూచించారు.

ఉచిత కంటి ఆపరేషన్ల కంటి అద్దాల పంపిణీ

మునుగోడు నవంబర్ 27(విజన్ఆంధ్ర)



మునుగోడు మండల పరిధిలోని బీరెల్లిగూడెం గ్రామ లబ్ధిదారులకు కంటి అద్దాలు సర్పంచ్ దాసరి గోవర్ధన్ శుక్రవారం రోజున అందజేశారు,ఈ సందర్భంగా మాట్లాడుతూ.ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి తల్లి పేరు మీద సుశీలమ్మ ఫౌండేషన్ నిరుపేదలకు అండగా నిలుస్తుందనీ కంటి సమస్యలతో బాధపడుతున్న పలువురి నిరుపేదలకు తన సొంత ఖర్చులతో కంటి ఆపరేషన్లు చేయించడంతో పాటు అవసరమైన వారికి కంటి అద్దాలను కూడా అందజేస్తున్నారు అని తెలిపారు,ఈ కార్యక్రమంలో. గ్రామ సర్పంచ్ దాసరి గోవర్ధన్ ఉపసర్పంచ్,లబ్ధిదారులు, తదితరులు,పాల్గొన్నారు.

మూడేళ్లయినా నిర్మాణానికి నోచుకోని బీటీ రోడ్డు

గుంతల మయంగా చిట్టెంపాడు- దామెర రహదారి 2023లో రూ. 2.20కోట్లతో బీటి రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన..

నాంపల్లి, నవంబర్, 27(విజన్ ఆంధ్ర):



మండల పరిధిలోని చిట్టెంపాడు నుంచి దామెర వరకు బీటీ రోడ్డు నిర్మాణానికి 2023లో అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో శంకుస్థాపన చేశారు. ఈ రహదారి నిర్మాణం కోసం రూ.2 కోట్ల 20 లక్షల బడ్జెట్‌ను సైతం కేటాయించారు. అయితే శంకుస్థాపన జరిగి మూడేళ్లు గడుస్తున్నప్పటికీ నేటికీ నిర్మాణ పనులు ప్రారంభం కాకపోవడంపై స్థానికులు, వాహనదారులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం ఈ రహదారి పూర్తిగా గుంతలమయంగా మారడంతో ప్రయాణికులు నిత్యం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు గుంతల కారణంగా ప్రమాదాల బారిన పడే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వర్షాకాలంలో గుంతల్లో నీరు నిలవడంతో రహదారిపై ప్రయాణించడం మరింత కష్టంగా మారుతోందని వాపోతున్నారు.ప్రజల రాకపోకలకు ఎంతో కీలకమైన ఈ రహదారి నిర్మాణానికి నిధులు కేటాయించి, శంకుస్థాపన చేసినప్పటికీ పనులు ఎందుకు ప్రారంభం కాలేదని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు వెంటనే స్పందించి పెండింగ్‌లో ఉన్న బీటీ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించి, ప్రయాణికుల ఇబ్బందులు తొలగించాలని చిట్టెంపాడు, దామెర గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

ఎల్‌నినో ప్రభావాన్ని అధిగమించేందుకు కూరగాయల సాగు చేపట్టాలి...

నాగార్జునసాగర్ నియోజకవర్గ ప్రతినిధి, నవంబర్ 27(విజన్ ఆంధ్ర);

ఎల్‌నినో ప్రభావంతో భవిష్యత్తులో ఎదురయ్యే నీటి ఎద్దడి పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని రైతులు ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి సారించాలని అనుముల క్లస్టర్ ఉద్యాన అధికారి మురళి సూచించారు. శుక్రవారం మండలంలోని పెద్దవూర, చింతపల్లి, బట్టుగూడెం, బసిరెడ్డిపల్లి, సిరిసనగండ్ల, కొత్తలూరు గ్రామాల్లో ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో రైతులకు కూరగాయల మినీ కిట్ల ప్యాకెట్లను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఉద్యాన అధికారి మురళి మాట్లాడుతూ.. రైతులు ఒకే రకమైన పంటలపై ఆధారపడకుండా పంట మార్పిడి విధానాన్ని అనుసరించాలని సూచించారు. ఉద్యాన శాఖ ద్వారా పంపిణీ చేస్తున్న మినీ కిట్లలో ఏడు రకాల కూరగాయల విత్తనాలు ఉన్నాయని, వీటిని సాగు చేసుకోవడం ద్వారా కుటుంబ అవసరాలకు సరిపడా కూరగాయలు



పొందడంతో పాటు మిగిలిన దిగుబడిని విక్రయించి అదనపు ఆదాయం పొందవచ్చని తెలిపారు.

ప్రస్తుత వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా తక్కువ నీటితో సాగు చేసుకునే కూరగాయల పంటలకు ప్రాధాన్యత ఇవ్వాలని, అందుబాటులో ఉన్న నీటిని ప్రణాళికాబద్ధంగా వినియోగించుకోవాలని పేర్కొన్నారు. రైతులు తమ పొలాల్లో నీటి కుంటలను నిర్మించుకొని వర్షపు నీటిని ఒడిసిపట్టి అవసరమైన సమయంలో సాగుకు ఉపయోగించుకోవాలని సూచించారు. అంతేకాకుండా ఉద్యానవన శాఖ ద్వారా ప్రభుత్వం అందిస్తున్న వివిధ రకాల రాయితీలు, పథకాలపై అవగాహన పెంచుకొని వాటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.తక్కువ పెట్టుబడితో కూరగాయల సాగు చేపట్టి సాగు ఖర్చులను తగ్గించుకోవడంతో పాటు అదనపు ఆదాయ మార్గాలను అన్వేషించాలని రైతులకు సూచించారు. వాతావరణ మార్పులు, నీటి కొరత వంటి పరిస్థితులను ముందుగానే అంచనా వేసుకొని వ్యవసాయ పద్ధతుల్లో మార్పులు చేసుకోవడం ద్వారా రైతులు ఆర్థికంగా నిలదొక్కుకోవచ్చని తెలిపారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచులు అయితేగోని వెంకటయ్య, కే. సంధ్య మురళి, జటావత్ రవి, తుడుం శ్రావణి, ఖమ్మంపాటి పద్మ, రావులపాటి రాంబాబు, ఆయా గ్రామాల ఉపసర్పంచులు, అనుముల క్లస్టర్ ఉద్యాన అధికారి మురళి, మండల వ్యవసాయ అధికారి సత్యనారాయణ, ఉద్యాన విస్తరణ అధికారి రాంప్రసాద్, ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

కరువు సర్వేను పారదర్శకంగా నిర్వహించాలి

--జిల్లా వ్యవసాయ అధికారి ఉల్లోజు వినోద్ కుమార్

మర్రిగూడ,నవంబర్ 27(విజన్ ఆంధ్ర):

వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో ప్రభుత్వం చేపట్టిన ‘కరువు 2026’ సర్వే ప్రక్రియను నల్గొండ జిల్లా వ్యవసాయ అధికారి ఉల్లోజు వినోద్ కుమార్ శుక్రవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. మర్రిగూడ మండల పరిధిలోని సరంపేట, లెంకలపల్లి గ్రామాలలో పర్యటించిన ఆయన, వాడిపోయిన పత్తి పంట పొలాలను స్వయంగా పరిశీలించారు.ఈ సందర్భంగా వ్యవసాయ విస్తరణ అధికారులు క్షేత్రస్థాయిలో పంట నష్టాన్ని అంచనా వేస్తున్న తీరును డీఏఓ అడిగి తెలుసుకున్నారు. కరువు వల్ల పత్తి దిగుబడిపై పడిన ప్రభావాన్ని, రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ఆయన రైతులతో మాట్లాడి ఆరా తీశారు. పంట నష్టం వివరాలు నమోదు చేయడంలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా పారదర్శకంగా సర్వే నిర్వహించాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు



జారీ చేశారు. అర్హులైన ప్రతి రైతుకు న్యాయం జరిగేలా వాస్తవ నివేదికలను ప్రభుత్వానికి పంపిస్తామని ఈ సందర్భంగా ఆయన రైతులకు భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమంలో మునుగోడు వ్యవసాయ సహాయ సంచాలకులు బి. వేణుగోపాల్,మండల వ్యవసాయ అధికారి ఎం. సాహస్, వ్యవసాయ విస్తరణ అధికారులు శివకుమార్, విజయ్ కుమార్, గ్రామ సర్పంచ్ రాములమ్మ,పలువురు స్థానిక రైతులు తదితరులు పాల్గొన్నారు.

చెరువు మట్టి తవ్వకాలపై ఎమ్మార్వో కు ఫిర్యాదు

పాలకవీడు నవంబర్ 27 (విజన్ ఆంధ్ర)



జాన్ పాడు చెరువులో రైల్వే లైన్ నిర్మాణం కోసం ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమతవ్వకాలపై పాలకీడు ఎమ్మార్వో కి బీజేపీ మండల పార్టీ అధ్యక్షుడు రమావత్ నరి నాయక్, దర్గా ఉపసర్పంచ్ రాజు రాథోడ్, సామాజిక కార్యకర్త నక్క శ్రీనివాస్, ఫిర్యాదు చేశారు. తక్షణ చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వానికి చెందిన చెరువులో మట్టి తవ్వాలంటే సంబంధిత శాఖల నుంచి ముందస్తు అనుమతులు తీసుకోవాల్సి ఉంటుంది. అలాంటిది రైల్వే లైన్ నిర్మాణం పేరుతో ఎవరి అనుమతితో మట్టిని తవ్వుతున్నారు? ఏ ప్రభుత్వ శాఖ అనుమతులు ఇచ్చింది? ఎంత పరిమాణంలో మట్టిని తరలిస్తున్నారు? అనే విషయాలను అధికారులు బహిర్గతం చేయాల్సిన అవసరం ఉంది. పూర్తి విచారణ చేసి చట్టపరమైన చర్యలు తీసుకొని యడల జిల్లా కలెక్టర్ ని కలిసి పిర్యాదు చేస్తామని డిమాండ్ చేశారు.

పేదలకు వరం సీఎం రిలీఫ్ ఫండ్

-సర్పంచ్ ఎడ్ల వెంకట్ రెడ్డి

భువనగిరి నవంబర్ 27(విజన్ ఆంధ్ర):

భువనగిరి మండలం బిఎన్ తిమ్మాపూర్ గ్రామానికి చెందిన లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ క్రింద భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనీల్ కుమార్ రెడ్డి సహకారంతో మన గ్రామ సర్పంచ్ యంగ్ మరియు డైనమిక్ లీడర్ ఎడ్ల వెంకట్ రెడ్డి నిరంతరం పర్యవేక్షణలో కుశంగుల నాగార్జున కు 60,000,బిచ్చల నర్సింహ 30,000 రూపాయల మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను సర్పంచ్ ఎడ్ల వెంకట్ రెడ్డి గారి చేతుల మీదుగా మన గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద లబ్ధిదారులకు చెక్కులు అందజేశారు.ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ



ప్రకృతి వైపరీత్యాలు,తీవ్రమైన అనారోగ్య సమస్యలు మరియు ప్రమాదాల బారిన పడిన నిరుపేద ప్రజలకు తక్షణ ఆర్థిక సహాయం కింద వైద్య ఖర్చుల నిమిత్తం ప్రభుత్వం ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా ఆస్పత్రిలో చికిత్స పొంది ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న పేదలకు సీఎం రిలీఫ్ ఫండ్ సహాయనిధి అనేది వరంలాంటిదని అన్నారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ పిన్నం శ్రీశైలం,సింగిల్విండో డైరెక్టర్ ఉడుత ఆంజనేయులు, వార్డు సభ్యులు దొంకేన పాండురంగం, జిన్న కవిత,జూపల్లి లావణ్య,తోటకురి రమేష్, గ్రామస్తులు పాల్గొన్నారు.

తాజ్ పూర్ లో ప్రత్యేక గ్రామసభ

-సర్పంచ్ ర్యాకల సంతోష శ్రీనివాస్

భువనగిరి నవంబర్ 27(విజన్ ఆంధ్ర)



తాజ్ పూర్ గ్రామంలో సర్పంచ్ ర్యాకల సంతోష శ్రీనివాస్ అధ్యక్షతన ప్రపంచ మరుగుదొడ్ల సందర్భంగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వహిస్తున్న "స్వచ్ఛ్ శౌచాలాయ్ – గారి మామయ్ భవిష్య"ినవంబర్ 19 నుండి డిసెంబర్ 10వరకురికార్యక్రమంలో భాగంగా ప్రత్యేక 'గ్రామసభ' నిర్వహించడం జరిగింది తాజ్ పూర్ గ్రామంలో నవంబర్ 19 ప్రపంచ మరుగుదొడ్ల దినోత్సవం సందర్భంగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వహిస్తున్న లిస్వచ్ఛ్ శౌచాలాయ్ – గారి మామయ్ భవిష్యత్ కార్యక్రమంలో భాగంగా సర్పంచ్ అధ్యక్షతన ప్రత్యేక గ్రామ సభ నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి సర్పంచ్ ర్యాకల సంతోష శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రతి ఇంటింటికి మరుగుదొడ్డి వాడకం ఎంతో అవసరమని బహిరంగ మలవిసర్జన మానేయాలని తద్వారా రోగాల బారిన పడకుండ బయటపడాలని సూచించారు.మరుగుదొడ్డి వాడిన ప్రతిసారి సక్రమంగా నీటిని వాడి పరిశుభ్రంగా ఉంచుకోవాలని వాడిన తరువాత చేతులను సబ్బుతో కడుకోవాలని తద్వారా మీ కుటుంబం ఆరోగ్యంగా వ్యాధులకు దూరంగా ఉండడానికి అవకాశం ఉంటుంది అన్నారు.అదేవిదంగా బాల్య వివాహాలు అరికట్టడం మనందరి బాధ్యత అని 18సంసారాలు నిండని అడపిల్లకు, 21సంవత్సరాలు నిండని అబ్బాయికి పెళ్లిచేయడం చట్టరీత్యా నేరం అన్నారు.బాల్య వివాహాలు నిర్మూలించడానికి ప్రతి ఒక్కరు క్షేత్ర స్థాయిలో అవగాహన పొందాలని సూచించారు.మన తాజ్ పూర్ గ్రామాన్ని ప్లాస్టిక్ రహిత గ్రామంగా తయారు చేసి ఆదర్శవంతంగా నిలపడానికి గ్రామప్రజలు సహకరించాలని కోరారు.ప్రతి ఇంటికి ఇంకుడు గుంత నిర్మించుకోవాలని భూగర్భ జలాలు పెరగడం తో పాటు పరిసరాలు పరిశుభ్రంగా ఉంటాయన్నారు. ప్రతి ఒక్కరూ 6 మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలని "మెరుగైన మరుగుదొడ్లు – సురక్షిత పారిశుధ్యం – గ్రామానికి సోపానం" అని పేర్కొన్నారు .ఈ ప్రత్యేక గ్రామ సభ లో సామాజిక వేత్త డా, ర్యాకల శ్రీనివాస్ , పంచాయతీ కార్యదర్శి, ఉపసర్పంచ్ మరియు వార్డు సభ్యులు, సమభావన సంఘాల మహిళలు, గ్రామపెద్దలు, యువత, గ్రామప్రజలు తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ మోటారు విద్యుత్ తీగల చోరీ.

పాలకవీడు నవంబర్ 27 (విజన్ ఆంధ్ర)



సూర్యాపేట జిల్లా పాలకీడు మండలం గుండె బోయిన గూడెం. గ్రామ పంచాయితీ పరిధిలో మోటార్ల విద్యుత్ తీగల చోరీతో రైతులు ఇబ్బందుల పడిన ఘటనలు వెలుగులోకి వచ్చాయి.గుండె బోయిన గూడెం. గ్రామ శివారు. కృష్ణ నదిపై రైతులు ఏర్పాటు చేసుకున్న వ్యవసాయ మోటార్ల తీగలను గురువారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు.చోరీకి పాల్పడినట్లు రైతులు చెప్తున్నారు. గ్రామానికి చెందిన ముండ్ల మరియన్న. దావీదు.అను రైతులకు సంబంధించిన.విద్యుత్ తీగలను కత్తిరించి సుమారు 200 అడుగులు పొడవు గల కాపర్ అల్యూమినియం దొంగిలించుకుపోయారాని. పాలకీడు పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు.దీనివల్ల ఇద్దరు రైతులకు సుమారు.80 వేలు వరకు ఆర్థిక నష్టం వాటిల్లడమే కాకుండా, పంటకు నీరు అందక ఎండిపోయే ప్రమాదం ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉంటే కృష్ణా నది తీర ప్రాంతంలో ఉన్న మరి కొంతమంది రైతుల విద్యుత్ తీగలను కూడా దొంగలించినట్లు. పలువురు రైతులు వాపోతున్నారు. రైతుల వ్యవసాయ మోటార్లనే టార్గెట్ చేస్తూ. చోరీలకు పాల్పడుతున్న దొంగలపై పోలీసు అధికారులు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

స్వర్ణ గిరిలో స్వామివారికి ఘనంగా పంచామృతాభిషేకం

భువనగిరి నవంబర్ 27(విజన్ ఆంధ్ర):



మాస ఆరుద్ర నక్షత్రం సందర్భంగా శ్రీ రామానూజాచర్య స్వామి వారికి నవ కలశ పూర్వక పంచామృతాభిషేకం నిర్వహించారు. ఉత్సవాలలో భాగంగా ప్రతిరోజు ఉదయం ఆలయంలోని అష్టలక్ష్మి మంటపంలో కార్తీక దామోదర హవనము నిర్వహిస్తారు.అనంతరం వైభవ మంటపంలో సత్య నారాయణ వ్రతం నిర్వహించారు. విశ్వేశ్వరుడైన శ్రీ వేంకటేశ్వర స్వామి వారికి పట్టు పీతాంబరాలు ధరింపజేసి మరియు సుగంధ భరిత పుష్పమాలలతో అలంకరించి అర్చక స్వాములు స్వామివారి నిత్య కళ్యాణ మహోత్సవాన్ని శ్రీవారి వైభవోత్సవ మండపంలో వేదమంత్రాలతో మంగళ ధ్వనుల మధ్య అంగరంగ వైభవంగా నిర్వహించారు.భక్తులు శ్రీ స్వామివారి కల్యాణ మహోత్సవాన్ని తిలకించి ఆనంద పరవశు లైనారు.సాయంత్రం సంధ్య వేళ ఆలయ ధ్వజస్తంభమునకు మోక్ష నారాయణ దీపాన్ని వెలిగిస్తారు. ఆదిమధ్యాంతరహితుడైన స్వర్ణగిరి శ్రీ వేంకటేశ్వర స్వామి వారిని మాడవీధులలో శోభాయ మానంగా ఊరేగిస్తూ భక్తుల గోవింద నామస్మరణలతో మేళతాళ మృదంగ మంగళ ధ్వనుల మధ్య శ్రీ స్వామివారి తిరువీధి ఉత్సవ సేవను ఘనంగా నిర్వహించారు.తిరువీధి ఉత్సవ సేవ అనంతరం శ్రీ వేంకటేశ్వర స్వామి వారు దేదీప్యమానంగా వెలుగుతున్న సహస్రదీప కాంతుల మధ్య ఊయలలో ఆసీనులై భక్తులకు దర్శనమిచ్చారు.అర్చక స్వాములు వేదమంత్రోచ్ఛారణలతో శ్రీ స్వామివారిని అర్చించి కర్పూర మంగళహారతులు సమర్పించారు.భక్తులు నయనానందకరంగా శ్రీవారినీ దర్శించుకున్నారు.

స్వర్ణగిరి దివ్య దేవస్థానంలో సాయంత్రం 7:30 నిమిషాలకు శ్రీ పద్మావతి అమ్మవారి కి సహస్ర కుంకుమార్చన సేవ అర్చక స్వాములు నిర్వహించారు.

సూర్యాపేట మున్సిపల్ అభివృద్ధికి నిధులు కేటాయించాలి..

సూర్యాపేట నవంబర్ 27:(విజన్ ఆంధ్ర)



పట్టణ అభివృద్ధికి అవసరమైన నిధులు కేటాయించడంతో పాటు మున్సిపాలిటీలో ఖాళీగా ఉన్న కీలక పోస్టులను భర్తీ చేయాలని మున్సిపల్ చైర్‌పర్సన్ మొరిశెట్టి నివేదిత కోరారు. శుక్రవారం ఈ మేరకు పురపాలక పరిపాలన శాఖ ముఖ్య కార్యదర్శి శ్రీదేవి ని కలిసి పట్టణ అభివృద్ధి, పరిపాలనా అవసరాలకు సంబంధించిన పలు ప్రతిపాదనలు, వినతిపత్రాలను అందజేశారు. మున్సిపాలిటీలో రెగ్యులర్ టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ (టీపీఓ)ను నియమించాలని, ఖాళీగా ఉన్న శానిటరీ ఇన్‌స్పెక్టర్ పోస్టును భర్తీ చేయాలని కోరారు. సిబ్బంది కొరత కారణంగా పట్టణ ప్రణాళిక, పారిశుధ్య నిర్వహణలో ఎదురయ్యే ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ఈ నియామకాలు చేపట్టాల్సిన అవసరం ఉందని వివరించారు.అలాగే అమృత్ పథకంలో భాగంగా దురాజ్‌పల్లి చెరువును పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేయాలని ప్రతిపాదించారు.పెండింగ్‌లో ఉన్న నూతన మాస్టర్ ప్లాన్‌కు ప్రభుత్వం నుంచి త్వరితగతిన అనుమతులు ఇప్పించాలని కోరారు. పట్టణంలో చేపట్టాల్సిన వివిధ అభివృద్ధి పనులకు అవసరమైన నిధులు కేటాయించి, పనులు ముందుకు సాగేలా సహకరించాలని సీడీఎంఏకు విజ్ఞప్తి చేశారు. సూర్యాపేట పట్టణాన్ని ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేయడంతో పాటు మౌలిక సదుపాయాలను మెరుగుపరిచేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.

మోటకొండూర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా క్యాసగల్ల చందు ఎన్నిక

భువనగిరి నవంబర్ 27(విజన్ ఆంధ్ర):



యాదాద్రి భువనగిరి జిల్లా మోట్టకొండూరు మండల కాంగ్రెస్ పార్టీ నూతన అధ్యక్షుడిగా క్యాసగల్ల చందు ఎన్నికయ్యారు. గురువారం టీపీసీసీ ఆదేశాల మేరకు మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి,ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య చేతుల మీదుగా మండల పార్టీ అధ్యక్షుడుగా ధ్రువీకరణ పత్రాన్ని అందుకున్నారు. మండల పరిధిలోని అమ్మనబోలు గ్రామ వాసి ,ఈ సందర్భంగా పార్టీ శ్రేణులు,శ్రేయోభిలాషులు ఆయనకు ఘనంగా శాలువాతో సన్మానించి, శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా చందు మాట్లాడుతూ ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య ఆదేశాల మేరకు పార్టీ బలోపేతం కోసం, గ్రామగ్రామాన కాంగ్రెస్ జెండా ఎగరవేసేందుకు కృషి చేస్తానని, నాయకుల సూచనల మేరకు పనిచేస్తానని తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం,ప్రజలకు ప్రభుత్వం ప్రవేశ పెట్టె సంక్షేమ పథకాలు ఇంటి ఇంటికి అమలు అయ్యే విదంగా కృషి చేస్తానని అన్నారు.గతంలో జిల్లా యువజన కాంగ్రెస్ విభాగం ఉపాధ్యక్షులు గా పనిచేశారు. మండల పార్టీ అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నా పార్టీ నాయకులు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు.

కోదాడ నియోజకవర్గంలో భూముల రీ-సర్వేకు సన్నాహాలు.

పారదర్శకంగా, పక్కాగా సర్వే నిర్వహించడమే లక్ష్యం.. అధికారులకు ఆర్డీవో దిశానిర్దేశం.

కోదాడ, నవంబర్ 27 (విజన్ ఆంధ్ర):

కోదాడ నియోజకవర్గ పరిధిలో చేపట్టనున్న భూముల రీ-సర్వే ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించేందుకు రెవెన్యూ, సర్వే శాఖల అధికారులు సిద్ధమవుతున్నారు. ఇందులో భాగంగా రీ-సర్వే విధివిధానాలు, భూముల కొలతలు, హద్దుల గుర్తింపు, భూ రికార్డుల పరిశీలన, సర్వే వివరాల నమోదు తదితర అంశాలపై సంబంధిత అధికారులకు శుక్రవారం ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహించారు.కోదాడ ఆర్డీవో సూర్యనారాయణ ఆధ్వర్యంలో జరిగిన ఈ శిక్షణ కార్యక్రమంలో మండల సర్వేయర్లు, రెవెన్యూ ఇన్స్పెక్టర్లు, లైసెన్స్డ్ సర్వేయర్లు, గ్రామపంచాయతీ అధికారులు పాల్గొన్నారు. భూముల రీ-సర్వే సమయంలో అనుసరించాల్సిన విధానాలు, క్షేత్రస్థాయిలో భూముల కొలతలు చేపట్టే పద్ధతులు, సరిహద్దుల గుర్తింపు, అందుబాటులో ఉన్న భూ రికార్డుల పరిశీలన, సర్వే వివరాల నమోదు తదితర అంశాలపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా ఆర్డీవో సూర్యనారాయణ మాట్లాడుతూ.. నియోజకవర్గ పరిధిలో చేపట్టనున్న భూముల రీ-సర్వేను పారదర్శకంగా, కచ్చితత్వంతో నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా పనిచేయాలని సూచించారు. భూముల కొలతలు, హద్దుల గుర్తింపు, రికార్డుల



పరిశీలనలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. రెవెన్యూ, సర్వే, గ్రామపంచాయతీ అధికారులు సమన్వయంతో పనిచేస్తూ రీ-సర్వే ప్రక్రియను విజయవంతం చేయాలని ఆదేశించారు.ఈకార్యక్రమంలో కోదాడ తహసీల్దార్ సంతోష్ కిరణ్, చిలుకూరు తహసీల్దార్ ధ్రువకుమార్, అనంతగిరి తహసీల్దార్ కమలాకర్, మునగాల తహసీల్దార్ సరిత, నడిగూడెం తహసీల్దార్ ఎల్. మంగ, రెవెన్యూ ఇన్స్పెక్టర్లు, గ్రామపంచాయతీ అధికారులు, సర్వేయర్లు తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా మూలమలుపులు

-ఆదమరిస్తే ప్రమాదమే

-సూచికలు ఏర్పాటు చేయని ఆర్ ఎండ్ బీ అధికారులు

త్రిపురారం, నవంబర్ 27 (విజన్ఆంధ్ర) :

మండలకేంద్రం నుండి వివిధ గ్రామాలకు వెళ్లేటటువంటి రోడ్డు మార్గాలు చాలా ప్రమాదకరంగా ఉన్నాయి. ఈ గ్రామాలకు వెళ్లేటటువంటి రోడ్డు మార్గాలలో ప్రమాదకరమయిన మూలమలుపులు ఉండటం వలన వాహనదారులు ఏ మాత్రం ఏమరపాటు వహించినా ప్రమాదాలకు గురి కాక తప్పదు. ముఖ్యంగా మండల కేంద్రం నుండి బెజ్జికల్, మర్రిగూడెం, మాటూరు గ్రామాల మీదుగా రాగడప గ్రామానికి వెళ్లేటటువంటి రోడ్డు మార్గం, దుగ్గేపల్లి, కామారెడ్డిగూడెం, కొణతాలపల్లి గ్రామాలకు వెళ్లే రోడ్డు మార్గం, మండలకేంద్రం నుంచి కుక్కడానికి వెళ్లేటటువంటి రోడ్డుమార్గాలలో చాలా ప్రమాదకరమయిన మూలమలుపులు ఉన్నాయి. ఈ రోడ్డు మార్గంలో ఒక మూలమలుపు దాటుతుండగానే మరొక మూలమలుపు వస్తుండడంతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఈ ప్రమాదకరమయిన మూలమలుపుల వద్ద గతంలో వాహనదారుల ప్రమాదాలకు గురి అయిన సంఘటనలు సైతం ఎన్నో ఉన్నాయి.

ఏర్పాటు చేయని ప్రమాద సూచికలు



ఈ రోడ్డు మార్గాలలో ప్రమాదకరమయిన మూలమలుపులు ఉండి ఎంతోమంది వాహనదారుల ప్రమాదాలకు గురి అవుతున్నప్పటికీ సంబంధిత ఆర్ఎండ్ బీ అధికారులు మాత్రం స్పందించడం లేదు. ఈ ప్రమాదకరమయిన మూలమలుపుల వద్ద కనీసం ప్రమాద సూచికలను ఏర్పాటు చేసి ప్రమాదాల నివారణలకు ఎలాంటి చర్యలు చేపట్టడం లేదు. ఇప్పటికైన సంబంధిత అధికారులు వెంటనే స్పందించి మండలంలో ప్రమాదకరంగా ఉన్నటువంటి మూలమలుపుల వద్ద ప్రమాద సూచికలను ఏర్పాటు చేసి వాహనదారుల ప్రమాదాలకు గురి కాకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

మాదకద్రవ్యాలు మానవ మనుగడకే పెను ప్రమాదం - డాక్టర్ కొమ్ము జనార్ధన్

కేతపల్లి నవంబర్ 27 (విజన్ ఆంధ్ర)

భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పిలుపు మేరకు, నషాముక్త భారత్ అభియాన్ లో భాగంగా..హైదరాబాద్ కేంద్రంగా కేంద్ర మంత్రివర్యులు జి కిషన్ రెడ్డి గారు నిర్వహించిన పాదయాత్రలో భాగంగా పాల్గొన్న భాజపా మెడికల్ సెల్ వైద్య బృందం. ఈ సందర్భంగా మెడికల్ సెల్ స్టేట్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ అయిన.. డాక్టర్ కొమ్ము జనార్ధన్ మాట్లాడుతూ.. యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని వాటి ఉచ్చులో పడకూడదని.. చెడు వ్యసనాలకు బానిసలై ఆర్థికంగా,



ఆరోగ్యవరంగా,మానసికవరంగా, వచ్చేటటువంటి సమస్యలకు దూరంగా ఉండాలని, అలాగే దేహ దారుఢ్యాన్ని పెంచుకొనుటకు.. వాకింగ్, యోగ, ప్రాణాయామం ,ఆటలు మొదలగు శారీరక వ్యాయామాలను అలవాటు చేసుకోవాలని,సమాజంలో మన చుట్టూ ఉన్నటువంటి వ్యక్తులను అబ్జర్వ్ చేస్తూ..చెడువ్యసనాలకు లోనైన యువతను..మార్చే విధంగా మోటివేట్ చేయాలని.. ఆ ఊబి లో పడకుండా చుట్టుపక్కల అందరిని చైతన్యవంతం చేయాలని పిలుపునిచ్చారు.

కేతేపల్లి మండలం లో పాఠశాలలను సందర్శించిన. డి ఈ ఓ పి. సుశీందర్ రావు

కేతపల్లి నవంబర్ 27 (విజన్ ఆంధ్ర)



కేతేపల్లి మండలం లోని వివిధ పాఠశాలలను జిల్లా విద్యాశాఖాధికారి పి.సుశీందర్ రావు సందర్శించి పలు సూచనలు చేశారు. మండలం లోని ఎంపీపీఎస్ బండపాలెం, ఎంపీపీ ఎస్ కొండ కింది గూడెం, జడ్.పి.హెచ్.ఎస్ చెరుకుపల్లి, ఎంపీపీ ఎస్ చెరుకుపల్లి, ఖ+దీఎ కేజీబీవీ చెరుకుపల్లి, ఎంపీపీఎస్ తుంగతుర్తి, జడ్.పి.హెచ్.ఎస్ తుంగతుర్తి, జడ్.పి.హెచ్.ఎస్ భీమారం తదితర పాఠశాలలను సందర్శిస్తూ క్వాలిటీ ఎడ్యుకేషన్ అందించాలని, ప్రతి విద్యార్థికి చదవడం రాయడం, గణితం లో చతుర్విధ ప్రక్రియలు కచ్చితంగా వచ్చేలా ప్రతి ఉపాధ్యాయుడు బోధించాలని ఈ సందర్భంగా తెలియజేశారు. ముఖ్యంగా వెనుకబడిన విద్యార్థుల పై ప్రత్యేక దృష్టి పెట్టి వారిని చదువులో ముందంజలో ఉండేలా చూడాలని కోరారు. మధ్యాహ్న భోజనం మెనూ ప్రకారంగా అందించాలి అని కోరారు.. 10వ తరగతి విద్యార్థులకు పరీక్షలు దగ్గర పడుతున్నందున సిలబస్ కంప్లీట్ చేసి ఉత్తీర్ణత శాతం పెంచేలా చూడాలని కోరారు. ప్రధానోపాధ్యాయులు ఎఫ్ ఎల్ ఎన్ మరియు ఎల్ ఈ పి అమలు చేయాలని కోరారు. ప్రీ ప్రైమరీ పాఠశాలలు సద్వినియోగం చేసుకోవాలని తెలియజేశారు. ప్రతి ఒక్కరూ నిబద్ధత తో పనిచేస్తూ బడులను బలోపేతం చేసి జిల్లాను ముందంజలో ఉంచాలని తెలిపారు.. ఈ కార్యక్రమంలో. ఈఎంఈఓ కె. బిక్షమయ్య ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కురుమ సంఘం భవనానికి భూమి పూజ కార్యక్రమం

మునుగోడు నవంబర్ 27(విజన్ఆంధ్ర)

మునుగోడు మండల పరిధిలోని కొరటికల్ గ్రామంలో కురుమ సంఘం భవనానికి శుక్రవారం రోజున ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి నిధుల నుంచి కేటాయించిన 5 లక్షల రూపాయలను భూమి పూజ కార్యక్రమానికి అందజేశారు, ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డిసిసిబి చైర్మన్ కుంభం శ్రీనివాస్ రెడ్డి హాజరై మండల నాయకులతో కలిసి భూమి పూజ కార్యక్రమం నిర్వహించారు,ఈ కార్యక్రమంలో .చండూరు మార్కెట్ కమిటీ చైర్మన్ ధోటి నారాయణ,సర్పంచ్ అద్దంకి రామలింగయ్య, ఉప సర్పంచ్ మందుల అంజయ్య,మండల అధ్యక్షులు భీమనపల్లి సైదులు,మండల ప్రధాన కార్యదర్శి, మందుల బీరప్ప,కురుమ సంఘం రాష్ట్ర నాయకులు మలిగ యాదయ్య,పాలకవర్గం సభ్యులు,కురుమ సంఘం మందుల పాండు,చలోజి మిర్యాల యాదయ్య, సంఘం అధ్యక్షులు వల్లూరి లింగయ్య,కుల పెద్దలు మిర్యాల బీరయ్య,బండాల నరసింహ,మందుల అయ్యన్న,బోడిశ లింగయ్య,మందులు ఎట్టయ్య, సుక్క సాయిలు, మందుల స్వామి, కాంగ్రెస్ పార్టీ నాయకులు,గ్రామ నాయకులు,తదితరులు, పాల్గొన్నారు.



దేవాదాయ శాఖ ఈవో చలపతిరావు నిర్లక్ష్యంపై భగ్గుమన్న మాజీ సర్పంచ్!.

పూజారికి, మేళగాళ్లకు వేతనాలు ఇవ్వకుండా వేధింపులు.

ఆరు నెలలుగా కనీసం మామిడి తోరణాలు కట్టని దుస్థితి.

ప్రధాన పండుగల నిర్వహణకు తూట్లు.. భక్తుల మనోభావాలతో చెలగాటం.

అనంతగిరి, నవంబర్ 27 (విజన్ ఆంధ్ర):

సూర్యాపేట జిల్లా అనంతగిరి మండల కేంద్రంలోని దేవాదాయ శాఖ ఎండోమెంట్ పరిధిలో ఉన్న ఆలయాల నిర్వహణను ఈవో తుమ్మల చలపతిరావు పూర్తిగా గాలికొదిలేశారని మాజీ గ్రామ సర్పంచ్ వేనేపల్లి వెంకటేశ్వరరావు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు.ఆలయ అభివృద్ధిని, సంప్రదాయాలను ఈవో పూర్తిగా విస్మరిస్తున్నారని ఆయన మండిపడ్డారు. నిత్యం స్వామివారికి ధూపదీప నైవేద్యాలు, పూజలు చేసే అర్చకుడికి మరియు మేళగాళ్లకు నెలల తరబడి వేతనాలు చెల్లించకుండా ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులకు గురిచేయడం దారుణమన్నారు. ఆలయ పవిత్రతకు చిహ్నమైన మామిడి తోరణాలను సైతం గత ఆరు నెలలుగా కట్టించలేని అసమర్థ స్థితిలో ఈవో వ్యవహరిస్తున్నారని విమర్శించారు.



హిందువులు అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకునే కృష్ణాష్టమి, దసరా, దీపావళి, కార్తీక పౌర్ణమి వంటి ప్రధాన పర్వదినాలను కూడా సక్రమంగా నిర్వహించకుండా ఈవో నిర్లక్ష్యం వహించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తన ఇష్టానుసారంగా వ్యవహరిస్తూ ఆలయ ప్రతిష్టను దిగజార్చడమే కాకుండా, కోట్లాది మంది భక్తుల మనోభావాలను తీవ్రంగా దెబ్బతీస్తున్నారని వెంకటేశ్వరరావు ఆవేదన వ్యక్తం చేశారు. దేవాదాయ శాఖ ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి ఈవో చలపతిరావుపై కఠిన చర్యలు తీసుకోవాలని, ఆలయ నిర్వహణను గాడిలో పెట్టాలని ఆయన డిమాండ్ చేశారు.

గడ్డిపల్లి సాంఘిక సంక్షేమ హాస్టల్‌లో వివాదం

- వాచ్మెన్‌పై విద్యార్థుల దాడి...

- వార్డెన్, వాచ్మెన్,విద్యార్థులు, తల్లిదండ్రుల పరస్పర ఆరోపణలు

- విద్యార్థులపై క్రమశిక్షణ చర్యలకు సిద్ధమైన వార్డెన్

గరిడేపల్లి, నవంబర్ 27, విజన్ ఆంధ్ర

గరిడేపల్లి మండలం గడ్డిపల్లి బాలుర సాంఘిక సంక్షేమ వసతిగృహం వివాదాలకు కేంద్రంగా మారింది. హాస్టల్‌లో పదో తరగతి చదువుతున్న కొంతమంది విద్యార్థులు వాచ్మెన్‌పై దాడి చేయడంతో వివాదం మరింత ముదిరింది. గతంలో హాస్టల్‌లో వసతులు, భోజనంపై విద్యార్థులు చేసిన ఫిర్యాదులు, తాజాగా విద్యార్థుల ప్రవర్తనపై వార్డెన్ చేసిన ఆరోపణలు చర్చనీయాంశంగా మారాయి.

వివరాల్లోకి వెళితే.. హాస్టల్‌లో వార్డెన్ సక్రమంగా విధులకు హాజరుకావడం లేదని, మెనూ ప్రకారం భోజనం అందించడం లేదని ఆరోపిస్తూ కొద్దిరోజుల క్రితం విద్యార్థులు జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన కలెక్టర్ విచారణకు ఆదేశించడంతో జిల్లాస్థాయి, మండలస్థాయి అధికారులు హాస్టల్‌ను సందర్శించి పరిస్థితులను పరిశీలించారు. అయితే ఇదే సమయంలో వార్డెన్ సైతం విద్యార్థుల ప్రవర్తనపై అధికారులకు ఫిర్యాదు చేసినట్లు తెలిసింది.

పదో తరగతి చదువుతున్న కొంతమంది విద్యార్థులు గుట్కా, అంబర్ వంటి మత్తు పదార్థాలు వినియోగిస్తున్నారని, సైకిల్ టైర్లకు పంక్చర్లు వేసేందుకు ఉపయోగించే సొల్యూషన్ వంటి పదార్థాలను ప్లాస్టిక్ కవర్లలో వేసుకుని పీలుస్తున్నారని వార్డెన్ ఆరోపించినట్లు సమాచారం. ఈ విషయంపై వైద్యుడిని పిలిపించి పరిశీలించగా కొంతమంది విద్యార్థులు వాటిని వినియోగిస్తున్నట్లు అంగీకరించారని, వారికి వైద్యులు కౌన్సెలింగ్ ఇచ్చినట్లు తెలిసింది. ఇటీవల హాస్టల్ వాచ్మెన్‌పై కొంతమంది విద్యార్థులు దాడి చేయడంతో వివాదం మరోసారి తెరపైకి వచ్చింది. విద్యార్థుల్లో క్రమశిక్షణ లోపించిందని, ఇలాంటి ప్రవర్తనను ఉపేక్షించేది లేదని, దాదాపు పది మంది విద్యార్థులను హాస్టల్ నుంచి తొలగించనున్నట్లు వార్డెన్ తెలిపినట్లు సమాచారం.

మరోవైపు విద్యార్థులు, వారి తల్లిదండ్రులు భిన్నమైన ఆరోపణలు చేస్తున్నారు. వాచ్మెన్ విద్యార్థులతో అసభ్యంగా మాట్లాడుతూ



తరచూ బూతులు తిడుతూ, కొడుతున్నారని, ఘటన జరిగిన రోజు కూడా దూషించడంతోనే విద్యార్థులు తిరగబడ్డారని చెబుతున్నారు. తమకు దాడి చేయాలనే ఉద్దేశం లేదని విద్యార్థులు పేర్కొంటున్నారు. తల్లిదండ్రులు సైతం వార్డెన్, వాచ్మెన్ తమ పిల్లలతో పాటు తమను కూడా దుర్భాషలాడారని, ఇష్టానుసారంగా మాట్లాడారని ఆరోపిస్తున్నారు.

ముఖ్యంగా పదో తరగతి విద్యార్థులకు మరో మూడు నెలల్లో బోర్డు పరీక్షలు ఉండగా, ఈ సమయంలో వారిని హాస్టల్ నుంచి తొలగిస్తే వారి భవిష్యత్తు దెబ్బతింటుందని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఈ వ్యవహారంపై పరిశీలిస్తే.. గతంలో మెనూ ప్రకారం భోజనం అందించడం లేదన్న విద్యార్థుల ఆరోపణల్లో కొంత వాస్తవం ఉన్నట్లు తెలుస్తోంది. కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన తర్వాత మెనూ ప్రకారం భోజనం అందిస్తున్నట్లు సమాచారం. అదే విధంగా కొంతమంది విద్యార్థులు గుట్కా, అంబర్, సొల్యూషన్ వంటి పదార్థాలు వినియోగించడం, సెల్‌ఫోన్లు ఉపయోగించడం వంటి విషయాలు కూడా వెలుగులోకి వచ్చాయి. మరోవైపు వార్డెన్, వాచ్మెన్ విద్యార్థులను దుర్భాషలాడుతున్నారన్న ఆరోపణలు కూడా విచారణలో తేలాల్సి ఉంది.

ఏదేమైనా విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని వారిని క్రమశిక్షణలో పెట్టాల్సిన బాధ్యత హాస్టల్ సిబ్బంది, అధికారులతో పాటు తల్లిదండ్రులపైనా ఉంది. విద్యార్థులు తప్పుదారి పట్టకుండా తగిన మార్గదర్శనం చేయడం అవసరం. ఈ నేపథ్యంలో ఉన్నతాధికారులు, పోలీసులు స్పందించి ఘటనపై సమగ్ర విచారణ చేపట్టాలని, విద్యార్థులకు మానసిక కౌన్సెలింగ్ అందించాలని, పదో తరగతి పరీక్షలను దృష్టిలో ఉంచుకుని వారి చదువుకు ఆటంకం కలగకుండా తగిన చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

పంటల నష్టం అంచనా

పత్తి పంట పొలాలు పరిశీలన

మునుగోడు నవంబర్ 27(విజన్ఆంధ్ర)



మునుగోడు మండల పరిధిలోని జమస్తాన్ పల్లి గ్రామంలో కరువు 2026 వఅబఎవతీఓఅశీఅ లో భాగంగా శుక్రవారం రోజున పత్తి పంట పొలాలను సందర్శించి పంట నష్టాన్ని అంచనా వేస్తున్న విధానాన్ని పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయ అధికారి ఉల్లోజు వినోద్ కుమార్,ఈ సందర్భంగా మాట్లాడుతూ. పంటలు నష్టపోయిన రైతులకు నష్టపరిహారం అందేలా చర్యలు తీసుకుంటామని అన్నారు, ఈ కార్యక్రమంలో. వ్యవసాయ సహాయ సంచాలకులు వేణుగోపాల్, మండల వ్యవసాయ అధికారి పద్మజ, వ్యవసాయ విస్తరణ అధికారి ఎం, నరసింహ, గ్రామ సర్పంచ్ అందుగుల నరసమ్మ,గ్రామ రైతులు, తదితరులు,పాల్గొన్నారు.

గుండెపోటుతో మేస్త్రి మృతి

మునుగోడు నవంబర్ 27(విజన్ఆంధ్ర)



మునుగోడు మండల పరిధిలోని తుర్కగూడెం గ్రామానికి చెందిన భవన కార్మిక సంఘం సభ్యులు మేకల కృష్ణయ్య మేస్త్రి శుక్రవారం రోజున గుండెపోటుతో మరణించారు, విషయం తెలుసుకున్న భవన కార్మికులు అందరూ పనికి బంద్ పెట్టి ప్రతి ఒక్కరూ సహకరించి అంతిమయాత్రలో పాల్గొనాలని అధ్యక్షులు పందుల చిన్న నరసింహ కోరారు.

పైళ్ల శేఖర్ రెడ్డి కుమార్తె వివాహ వేడుకకు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించిన

జగదీశ్వర్ రెడ్డి, చింతల వెంకటేశ్వర్ రెడ్డి

బీబీనగర్: 27/నవంబర్ (విజన్ ఆంధ్ర)



శంషాబాద్ సమీపంలోని జిమ్మెర్ కన్వెన్షన్ హాల్‌లో భువనగిరి మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్ రెడ్డి కుమార్తె వివాహ వేడుక ఘనంగా నిర్వహించారు. ఈ వివాహ వేడుకకు మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంతకండ్ల జగదీశ్వర్ రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ రాష్ట్ర నాయకులు చింతల వెంకటేశ్వర్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా నూతన వధూవరులను ఆశీర్వదించి, వారి వైవాహిక జీవితం సుఖసంతోషాలతో నిండాలని ఆకాంక్షిస్తూ శుభాకాంక్షలు తెలిపారు.

తెలంగాణ రక్షణ సేన పార్టీలో పలువురు చేరిక

మునుగోడు మండల పరిధిలోని రత్తిపల్లి గ్రామానికి చెందిన యువ నాయకులు బోల్గురి ముఖేష్



తెలంగాణ రక్షణ సేన (ఁ=ా) పార్టీ సిద్ధాంతాలకు, నాయకత్వానికి ఆకర్షితులై నియోజకవర్గంలోని తన అనుచరులతో కలిసి శుక్రవారం రోజున పార్టీలో చేరారు,? నల్గొండ జిల్లా అధ్యక్షులు పడిగపాటి విక్రాంత్ రెడ్డి, నియోజకవర్గ అధ్యక్షురాలు కర్నాటి మాధవి ఆధ్వర్యంలో ఈ చేరిక కార్యక్రమం ఘనంగా జరిగింది,ఈ సందర్భంగా, తెలంగాణ రక్షణ సేన పార్టీ అధినేత్రి కల్వకుంట్ల కవిత బోల్గురి ముకేష్‌కు పార్టీ కండువా కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారుఈ సందర్భంగా కల్వకుంట్ల కవిత మాట్లాడుతూ, ప్రజా సమస్యల పరిష్కారం కోసం పోరాడే యువతకు తెలంగాణ రక్షణ సేన ఎల్లప్పుడూ అండగా ఉంటుందని, నల్గొండ జిల్లాలో పార్టీ బలోపేతానికి నూతన నాయకులు కృషి చేయాలని పిలుపునిచ్చారు, ఈ కార్యక్రమంలో.నకిరేకల్ నియోజకవర్గ అధ్యక్షులు మేడి నరేష్, ప్రత్యేకంగా పాల్గొని నూతనంగా చేరిన వారికి శు భాకాంక్షలు తెలిపారు.ఆయన బృందం సభ్యులు గాదె జగదీశ్, గాదె రాజు, బోల్గురి రాకేష్, గాదె యాదయ్య, బొడ్డుపల్లి రాజు, గాదె నగేష్, పందుల మహేష్,మైల నర్సింహా, తదితరులు,పాల్గొన్నారు.

ఈ నెల 29న జరిగే దీక్షా దీవాస్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

-- బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు కొమ్మిడి ప్రభాకర్ రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మహేందర్ నాథ్

అడ్డగూడూరు, నవంబర్ 27 (విజన్ ఆంధ్ర):



ఈ నెల 29న మోత్కూరులో నిర్వహించే దీక్షా దీవాస్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు కొమ్మిడి ప్రభాకర్ రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ చిప్పలపల్లి మహేందర్ నాథ్ కోరారు. శుక్రవారం మండల కేంద్రంలో బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశ నిర్వహించి కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా మాజీ ఎమ్మెల్యే గాదరి కిషోర్ కుమార్ హాజరవుతున్నారని తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన కోసం 2009లో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ చేపట్టిన దీక్ష దీవాస్ కార్యక్రమం నేటి యువతకు తెలియాల్సిన అవసరం ఉందని అన్నారు. నాటి ఆంధ్ర పాలకుల పెత్తనంతో తెలంగాణ రాష్ట్రం ఆగమైపోతుందని కేసీఆర్ ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ధ్యేయంగా పోరాటం చేశారని ఎంతోమంది విద్యార్థుల ఆత్మ బలిదానాలతో ప్రత్యేక తెలంగాణ కళ సాకారమైందన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ దర్శనాల అంజయ్య బీఆర్ఎస్ నాయకులు పూలపల్లి జనార్దన్ రెడ్డి, చలపతి రెడ్డి, వెంకట్ రెడ్డి, పూజారి సైదులు, దేశపాక నాగయ్య, గజ్జెలి రవి, నర్సిరెడ్డి, కిరణ్ నరేందర్, ఎలేందర్, భాస్కర్ రెడ్డి, పరమేష్, ఆందోని, వెంకటేష్, రాజు తదితరులు పాల్గొన్నారు.

మహాదేవ నామేశ్వర ఆలయంలో కన్నులపండువగా ధ్వజస్తంభ పునఃప్రతిష్ట

అయ్యప్ప మహా పడిపూజ

సూర్యాపేట రూరల్ నవంబర్ 27:(విజన్ ఆంధ్ర)



మున్సిపల్ పరిధిలోని పిల్లలమర్రిలో శ్రీ మహాదేవ నామేశ్వర స్వామి దేవాలయంలో శుక్రవారం ఆధ్యాత్మిక శోభతో విరాజిల్లింది. ఆలయ త్రికూటాలయం ఎదుట నూతన ధ్వజస్తంభ పునఃప్రతిష్టాపన మహోత్సవం మరియు అయ్యప్ప స్వామి మహా పడిపూజ కార్యక్రమాలు అత్యంత భక్తిశ్రద్ధలతో, వైభవంగా జరిగాయి. వేద పండితులు పులి హరి ప్రసాద శర్మ ఆధ్వర్యంలో, వేద మంత్రోచ్ఛారణలు, మంగళవాయిద్యాల నడుమ శాస్త్రోక్తంగా కార్యక్రమాన్ని నిర్వహించారు. గణపతి పూజ, పుణ్యాహవాచనం, ప్రత్యేక హోమాలు జరిపి, అనంతరం త్రికూటాలయం ఎదుట ధ్వజస్తంభ పునఃప్రతిష్టను కన్నులపండువగా పూర్తి చేశారు. అనంతరం ఆలయ ఆవరణలో అయ్యప్ప స్వామి పడిపూజను వైభవంగా చేపట్టారు. పూలమాలలు, దీపాలంకరణలతో శోభాయమానంగా తీర్చిదిద్దిన పద్దెనిమిది మెట్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అయ్యప్ప స్వామి నామస్మరణలు, భజనలతో ఆలయ పరిసరాలు మారుమోగాయి. అనంతరం ఆలయానికి విచ్చేసిన భక్తులందరికీ అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. శివాలయ కమిటీ మాజీ చైర్మన్ రాపర్తి సైదులు గౌడ్ – పద్మ దంపతుల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేనారెడ్డి, శివాలయ కమిటీ చైర్మన్ కొండ వెంకన్న గౌడ్, కౌన్సిలర్ కోడి నాగరాజు, యాదవ్, మాజీ సర్పంచ్ సోమగాని లింగస్వామి, మాజీ ఎంపీటీసీ రాపర్తి శ్రీనివాస్, చెరుకుపల్లి వెంకట్ లాల్, వల్లాల సైదులు, మాదగోని నాగయ్య తదితరులు పాల్గొన్నారు. గురుస్వామి కడారి వెంకన్న నిర్వహించిన పడిపూజలో భజన బృందం ఈద సంజీవ చేసిన భోజనాలు భక్తులను ఆకట్టుకున్నాయి.

కరువు ప్రకటించడంతోనే ప్రభుత్వ బాధ్యత ముగిసిపోయిందా?

నాంపల్లి, నవంబర్, 27(విజన్ ఆంధ్ర):

నల్గొండ జిల్లా ప్రజలు ఎదుర్కొంటున్న కరువు పరిస్థితులపై రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే స్పందించి రైతులకు అవసరమైన సహాయక చర్యలు చేపట్టాలని బీజేవైఎం నాయకుడు నాంపల్లి సతీష్ డిమాండ్ చేశారు. కరువు ప్రకటించడంతోనే ప్రభుత్వ బాధ్యత ముగిసిపోయిందా అని ఆయన ప్రభుత్వాన్ని ప్రశ్నించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎల్‌నినో ప్రభావంతో నల్గొండ జిల్లాలో కరువు పరిస్థితులు రోజురోజుకూ తీవ్రరూపం దాల్చుతున్నాయని, భూగర్భ జలాలు అడుగంటడంతో బోర్లు, బావుల్లో నీటిమట్టం తగ్గి రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పంటలు ఎండిపోతూ రైతులు పెట్టుబడులు కోల్పోయి ఆర్థికంగా నష్టపోతున్నప్పటికీ ప్రభుత్వం స్పందిస్తున్న తీరు ఏమాత్రం సంతృప్తికరంగా లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు.కరువు ప్రభావిత ప్రాంతాల్లో క్షేత్రస్థాయిలో పర్యటించి పంట నష్టాలను సమగ్రంగా అంచనా వేయాలని, నష్టపోయిన రైతులకు తక్షణమే పంట నష్టపరిహారం అందించాలని కోరారు. అలాగే రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు, సాగునీరు, తాగునీటి సౌకర్యాలు కల్పించడంతో పాటు ఉపాధి హామీ పనులను విస్తృతంగా చేపట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ప్రకటనలకే పరిమితం కాకుండా కరువు బాధిత రైతులను ఆదుకునేలా ప్రభుత్వం కార్యాచరణ రూపొందించి తక్షణ సహాయక చర్యలు చేపట్టాలని నాంపల్లి సతీష్ ప్రభుత్వాన్ని కోరారు.

ఖానాపురంలో ఇందిరమ్మ జీవిత బీమా పథకం ప్రారంభం.

అనంతగిరి, నవంబర్ 27 (విజన్ ఆంధ్ర):



అనంతగిరి మండలం ఖానాపురం గ్రామంలో ఇందిరమ్మ జీవిత బీమా పథకాన్ని సర్పంచ్ కుంటు లాజర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 19 నుంచి 59 ఏళ్ల వయసు కలిగిన అర్హులైన ప్రతి ఒక్కరూ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కుటుంబ పెద్దకు జీవిత భద్రత కల్పించడంతో పాటు ఆపద సమయంలో కుటుంబానికి ఆర్థిక భరోసా కల్పించడమే పథకం ముఖ్య ఉద్దేశమని తెలిపారు. అర్హులైన వారందరూ పథకంలో భాగస్వాములు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ గింజుపల్లి జగన్, కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షుడు కనగాల వీరయ్య, కోదాడ చెరువు సంఘం సర్పంచ్ శీలం నాగేంద్రబాబు, కాంగ్రెస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి జొన్నలగడ్డ కోటేశ్వరరావు, మాజీ సర్పంచులు గింజుపల్లి రఘు, గాదే వెంకన్న, కార్యదర్శి లక్ష్మి, వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డికి ప్రత్యేక ఆహ్వానం

ఎమ్మెల్యేని కలిసి ఆహ్వానించిన వెదిరె బ్రదర్స్

మునుగోడు నవంబర్ 27(విజన్ఆంధ్ర)



మునుగోడు మండల పరిధిలోని కొంపల్లి గ్రామంలో డా బి.ఆర్.అంబేద్కర్ విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరుకావాలని కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి వెదిరె బ్రదర్స్ శుక్రవారం రోజున తన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి ఆహ్వానించారు.

దివంగత వెదిరె పూలమ్మ మధుసూదన్ రెడ్డి జ్ఞాపకార్థం,వెదిరె పూలమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో డా బి.ఆర్.అంబేద్కర్ విగ్రహాన్ని నిర్మించారు,ఈ విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేయాలని కోరారు,ఈ కార్యక్రమంలో.ఫౌండేషన్ చైర్మన్ వెదిరె మేఘా రెడ్డి,వైస్ చైర్మన్ వెదిరె విజేందర్రెడ్డి, జీడీమడ్ల దశరథ,మండల కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి సంకు శంకర్,తదితరులు, పాల్గొన్నారు.

సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో యువసే రుణ విస్తరణ కార్యక్రమం

కొండమల్లేపల్లి నవంబర్ 27 (విజన్ ఆంధ్ర):-

శుక్రవారం రోజు సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా -- కొండమల్లేపల్లి ఆధ్వర్యంలో కొండమల్లేపల్లి మండలంలో వ్యవసాయ రుణ విస్తరణ కార్యక్రమం ఘనంగా నిర్వహించడం జరిగింది

ఈ కార్యక్రమంలో సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా జనరల్ మేనేజర్ (బొంబాయి) గారు రైతులకు మరియు మహిళా సంఘాల సభ్యులకు బ్యాంకుల ద్వారా అందించే వివిధ రకాల రుణ సదుపాయాలు, వాటి ప్రయోజనాల గురించి వివరంగా తెలియజేశారు



ఈ సందర్భంగా జనరల్ మేనేజర్ గారి చేతుల మీదుగా 11 మహిళా సంఘాలకు రూ. 1 కోటి 70 లక్షల రుణ చెక్కులను పంపిణీ చేయడం జరిగింది. అదేవిధంగా పీఎంజేజేబుయ్ పి ఎం ఎస్ బి వై పథకాల చెక్కులను కూడా పంపిణీ చేయడం జరిగింది

ఈ కార్యక్రమంలో సిబిఐ జనరల్ మేనేజర్ (బొంబాయి) రీజినల్ మేనేజర్ (వరంగల్) ఎల్ డి ఎం డీపీఎం, సిబిఐ మేనేజర్లు, ఫీల్డ్ ఆఫీసర్లు, మండల సమాఖ్య అధ్యక్షురాలు , ఏపీఎం , ఊబ్ లు, వివో ఏ లు మరియు మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

ఈ కార్యక్రమం ద్వారా రైతులకు, మహిళా సంఘాలకు బ్యాంకింగ్ రుణ సదుపాయాలపై అవగాహన కల్పించడంతో పాటు, ఆర్థిక అభివృద్ధికి మరింత ప్రోత్సాహం లభించింది

ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అధికారులకు, పాల్గొన్న ప్రతి ఒక్కరికీ హృదయపూర్వక ధన్యవాదాలు

ఇంటి నుండే పది, ఇంటర్ రాసుకునే అవకాశం.

5 నెలల్లో ఇంటర్ పూర్తి చేసుకునే అవకాశం.

ఎలాంటి విద్యార్హత లేకున్నా పది రాసుకునే అవకాశం.

అడ్మిషన్లకు అపరాదా రుసుము తో చివరి తేదీ 30-11-2026 మాత్రమే.

లక్ష్య డిస్టెన్స్ అకాడమీ కోఆర్డినేటర్ అనంతుల సతీష్.

కోదాడ, నవంబర్ 27 (విజన్ ఆంధ్ర):

తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ ఆధ్వర్యంలో కొనసాగుతున్న ఓపెన్ టెన్త్, ఇంటర్ 2026 విద్యా సంవత్సరానికి అడ్మిషన్లు ప్రారంభమైతున్నట్లు లక్ష్య డిస్టెన్స్ అకాడమీ కోఆర్డినేటర్ అనంతుల సతీష్ ఒక ప్రకటనలో తెలిపారు వారు మాట్లాడుతూ చదువు మధ్యలో మానేసిన వారు ఎలాంటి విద్యార్హత లేకున్నా 14 సంవత్సరాలు నిండిన వారందరూ 10వ తరగతి రాసుకునే అవకాశం కలదు పది పాసైన వారు ఇంటర్ ఒక్క సంవత్సరంలో పూర్తి చేసుకునే అవకాశం ఉన్నదని తెలిపారు ఈ అవకాశం మళ్లీ రాదని వెంటనే అడ్మిషన్



తీసుకోవాలని వారు చెప్పారు కేవలం ఒకే సంవత్సరంలో ఇంటర్ పూర్తి చేసుకునే అవకాశం కలదు ఇంటర్లో కోర్సులు బైపిసి ఎంపీసీ సీఈసీ తెలుగు, ఇంగ్లీష్ మీడియాలో చదువుకునే అవకాశం కలదు అడ్మిషన్లకు సంప్రదించాల్సిన చిరునామా లక్ష్య డిస్టెన్స్ అకాడమీ బ్రిలియంట్ స్కూల్ పక్కన నయా నగర్ కోదాడ సంప్రదించండి ఫోన్ నెంబర్లు 9542107771 ,7981528312 సంప్రదిచగలరు వారు కోరారు.

విద్యార్థుల విద్యా సామర్థ్యాల పెంపుపై ప్రత్యేక దృష్టి పెట్టాలి..

సూర్యాపేట నవంబర్ 27:(విజన్ ఆంధ్ర)

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల విద్యా సామర్థ్యాలను మెరుగు పరిచేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం జిల్లా కలెక్టరేట్‌లో మండల విద్యాధికారులు (ఎంఈఓలు), కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులతో జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. తెలుగు, గణితం, ఆంగ్లం సబ్జెక్టుల్లో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని, ప్రతిరోజూ గంటపాటు రెమిడియల్ తరగతులు నిర్వహించాలని సూచించారు. ఈ నెలలో 10 ఎఫ్ఎల్ఎన్ కాంపిటెంట్ పాఠశాలలను సందర్శించక పోవడంపై వివరణ కోరడంతో పాటు వెంటనే సందర్శనలు పూర్తి చేయాలని ఆదేశించారు. పాఠశాలల సందర్శనల్లో మంచి పనితీరు కనబరిచిన కందిబండ ప్రాథమిక పాఠశాలను అభినందించారు.ఎస్ఎస్సీ సమ్మేటివ్-1 ఫలితాల్లో అన్ని సబ్జెక్టులతో పాటు గణితంలోనూ వెనుకబడిన 31 పాఠశాలలపై ప్రత్యేక దృష్టి సారించాలని, ఆయా సబ్జెక్టు నిపుణుల సేవలను వినియోగించుకోవాలని



ఎంఈఓలు, కాంప్లెక్స్ హెచ్ఎంలను ఆదేశించారు. ప్రతిరోజూ ఎఫ్ఆర్ఎస్ హాజరును పర్యవేక్షిస్తూ 90 శాతానికి పైగా హాజరు నమోదయ్యేలా చూడాలన్నారు. ప్రీ ప్రైమరీలో విద్యార్థుల నమోదు పెంచాలని, ప్రత్యేక అవసరాలున్న పిల్లలకు సంబంధించిన భవనాల నిర్మాణాలు పూర్తి చేయాలని సూచించారు. అపార్ ఐడీ జనరేషన్‌ను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. పీఎం శ్రీ, సమగ్ర శిక్ష నిధులు, పీఎం పోషణ బడ్జెట్‌ను సక్రమంగా వినియోగించాలని తెలిపారు. ఖాన్ అకాడమీ, ఫిజిక్స్ వాలా, ఏఎక్స్ఎల్ ల్యాబ్స్ పనితీరును మెరుగుపర్చాలని సూచించారు. పాఠశాలల్లో డ్రగ్ ఫ్రీ వాతావరణం కల్పించేందుకు అందరూ కృషి చేయాలని, మధ్యాహ్న భోజన పథకం (ఎండీఎం) డాష్‌బోర్డును ప్రతి వారం పర్యవేక్షించాలని ఆదేశించారు. స్పర్శ్ బిల్లుల ఆమోదంలో ఉన్న సమస్యలను డీటీఓను సమావేశానికి పిలిపించి పరిష్కరించారు.

ఈ సమావేశంలో జిల్లా విద్యాశాఖ కోఆర్డినేటర్లు వై. రాంబాబు, శ్రవణ్, ఈ. హరికృష్ణ, టీ. పూలన్, సూర్యనారాయణ, సూపరింటెండెంట్ మోహన్, ఎఫ్ఎల్ఎన్ సెల్ సభ్యులు, ఎంఈఓలు, కాంప్లెక్స్ హెచ్ఎంలు, డీఈఓ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అలుగునూర్ కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడిగా గుండగాని సైదులు..

నూతనకల్, నవంబర్ 27 (విజన్ ఆంధ్ర)



తుంగతుర్తి శాసన సభ్యులు మందుల సామేల్,జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గుడిపాటి నర్సయ్య ల ఆదేశానుసారం మండల పరిధిలోని అలుగునూర్ కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షునిగా గుండగాని సైదులు ను శుక్రవారం ఎన్నుకున్నట్లు మండల కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కట్ట మల్లారెడ్డి తెలిపారు.ఎన్నికైన సైదులుకు నియామక పత్రాన్ని అందజేసి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీనీ గ్రామస్థాయి నుండి బలోపేతం చేయాలని వారికి సూచించారు.ఈ కార్యక్రమంలో నాయకులు నాగం సుధాకర్ రెడ్డి,గుగులోతు కృష్ణ నాయక్, చురుకంటి చంద్రారెడ్డి,భూరెడ్డి మధుసూదన్ రెడ్డి,బంటు బద్రి, గుండగాని వెంకన్న,శ్రీను, నాగయ్య,శివ,మల్లేష్,కుశలవ, గణేష్,మురళి,వెంకటేశ్వర్లు, నరేష్,ఉపేందర్,యాక సైదులు, సోమయ్య,వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

దీక్షా దివస్ విజయవంతం చేయాలి:

మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్ రావు....

మిర్యాలగూడ,నవంబర్27(విజన్ ఆంధ్ర);

తెలంగాణ రాష్ట్ర సాధన కోసం కేసీఆర్ చేపట్టిన ఆమరణ నిరాహార దీక్షకు గుర్తుగా ఆదివారం నాడు నిర్వహించే దీక్షా దివస్ సందర్భంగా పట్టణంలోని రెడ్డి కాలనీలో గల బీఆర్ఎస్ పార్టీ కార్యాలయం నందు మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్ రావు అధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని, మొదటగా మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేసి, తదుపరి మలిదశ తెలంగాణ ఉద్యమకారులను ఘనంగా సన్మానించి, పార్టీ కార్యాలయం నుండి బైక్ పై ర్యాలీగా వెళ్తూ అమరవీరుల స్థూపం వద్ద నివాళులర్పించడం జరుగుతుందని, కనుక బిఆర్ఎస్ పార్టీ నాయకులు,ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు, ఉద్యమకారులు పాల్గొని విజయవంతం చేయాలని సందర్భంగా తెలియజేశారు..



సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

మునుగోడు నవంబర్ 27(విజన్ఆంధ్ర)



ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి ఆదేశాల మేరకు మునుగోడు మండలంలోని లబ్ధి దారులకు శుక్రవారం రోజున ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను ఉమ్మడి నల్గొండ జిల్లా డిసిసిబి చైర్మన్ కుంభం శ్రీనివాస్ రెడ్డి అందజేశారు, ఈ సందర్భంగా మాట్లాడుతూ.కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలకు అండగా ఉంటుందని అన్నారు,ఈ కార్యక్రమంలో. చండూర్ మార్కెట్ చైర్మన్ దోటి నారాయణ,మండల పార్టీ అధ్యక్షులు భీమనపల్లి సైదులు,ఆయా గ్రామాల సర్పంచులు,మాజీ ప్రజా ప్రతినిధులు,తదితరులు పాల్గొన్నారు.

ఉమ్మడి నల్గొండ చెస్ టోర్నీకి వేదశ్రీ ఎంపిక

-అండర్-14 బాలికల విభాగంలో 5కు 4 పాయింట్లు

-జిల్లా స్థాయిలో ప్రతిభ చాటిన మునగాల విద్యార్థిని

?మునగాల నవంబర్27 (విజన్ ఆంధ్ర)

సూర్యాపేట జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (బాలుర)లో జరిగిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లా స్థాయి చెస్ పోటీల్లో మునగాల మండలానికి చెందిన బంగారపు వేదశ్రీ ప్రతిభ కనబర్చింది. బాలికల అండర్-



14 విభాగంలో పోటీపడి 5 పాయింట్లకు 4 పాయింట్లు సాధించింది. ఈ ప్రదర్శనతో ఉమ్మడి నల్గొండ జిల్లా స్థాయి చెస్ టోర్నీకి ఎంపికైంది. ?ఈ సందర్భంగా మునగాల పీఎం శ్రీ తెలంగాణ మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ కె. వీరబాబు మాట్లాడుతూ.. తమ పాఠశాలలో 6వ తరగతి చదువుతున్న వేదశ్రీ ఉమ్మడి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికవడం సంతోషంగా ఉందన్నారు. భవిష్యత్తులో మరిన్ని టోర్నీల్లో రాణించి పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఆమె క్రీడా ప్రతిభను ప్రోత్సహించేందుకు పూర్తి సహకారం అందిస్తామని తెలిపారు.?ఉమ్మడి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైన వేదశ్రీని ఎస్జీఎఫ్ జిల్లా కార్యదర్శి కిరణ్ కుమార్, పాఠశాల ఇంచార్జి ప్రిన్సిపల్ జె. రామకృష్ణ, పలువురు ఉపాధ్యాయులు అభినందించారు.

భక్తిశ్రద్ధల మధ్య ధ్వజస్తంభ పునఃప్రతిష్ఠ..

సూర్యాపేట నవంబర్ 27:(విజన్ ఆంధ్ర)

సూర్యాపేట పట్టణంలోని 12వ వార్డు పిల్లలమర్రిలో మాజీ శివాలయ కమిటీ చైర్మన్ రాపర్తి సైదులు గౌడ్ పద్మ ఆహ్వానం మేరకు శ్రీ మహదేవ నామేశ్వర స్వామి వారి త్రికూటాలయం దేవాలయంలో నిర్వహించిన ధ్వజస్తంభ పునఃప్రతిష్ఠ మహోత్సవంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానిక మున్సిపల్ కౌన్సిలర్ కోడి



నాగరాజు,11వ వార్డు కౌన్సిలర్ ఎల్గూరి ఇందిరా వీరయ్య గౌడ్, దేవాలయ చైర్మన్ కొండ వెంకన్న, మాజీ ఎంపిటిసి రాపర్తి శ్రీనివాసు, మాజీ సర్పంచ్ మామిడి సుగుణమ్మ, మాజీ దేవాలయ చైర్మన్ కోట్ల సైదులు,రాపర్తి మహేష్, వార్డు అధ్యక్షుడు సంద సైదులు, సాదక్, లంజపల్లి సురేష్, తాలింపు కృష్ణయ్య, మార్కెట్ కమిటీ డైరెక్టర్ షేక్ అబ్దుల్ కరీం, జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు పిడమర్తి ఉపేందర్, షేక్ రహీం, కోడి కిరణ్, నర్సింగ్ కిరణ్, షేక్ గౌస్ పాషా, తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్ప స్వామి సేవలో కొప్పుల వేణారెడ్డి..

సూర్యాపేట నవంబర్ 27:(విజన్ ఆంధ్ర)

సూర్యాపేట పట్టణంలోని 12వ వార్డు పిల్లలమర్రిలో శ్రీ అయ్యప్ప స్వామి పడి పూజ మహోత్సవం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. మాజీ శివాలయ కమిటీ చైర్మన్ రాపర్తి సైదులు గౌడ్, పద్మ దంపతుల ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన ఈ వేడుకలకు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి హాజరై స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయంలో నిర్వహించిన పూజా కార్యక్రమాల్లో అయ్యప్ప స్వామి భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని భక్తిని చాటుకున్నారు.



స్వామివారి కృపతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. పడి పూజ మహోత్సవంతో పిల్లలమర్రి ప్రాంతంలో ఆధ్యాత్మిక సందడి నెలకొంది. ఈ కార్యక్రమంలో స్థానిక మున్సిపల్ కౌన్సిలర్ కోడి నాగరాజు, 11వ వార్డు కౌన్సిలర్ ఎల్గూరి ఇందిరా వీరయ్య గౌడ్, దేవాలయ చైర్మన్ కొండ వెంకన్న, మాజీ ఎంపీటీసీ రాపర్తి శ్రీనివాసు, మాజీ సర్పంచ్ మామిడి సుగుణమ్మ, మాజీ దేవాలయ చైర్మన్ కోట్ల సైదులు, వార్డు అధ్యక్షుడు సంద సైదులు, సాదక్, లంజపల్లి సురేష్, తాలింపు కృష్ణయ్య, మార్కెట్ కమిటీ డైరెక్టర్ షేక్ అబ్దుల్ కరీం, జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు పిడమర్తి ఉపేందర్, షేక్ రహీం, కోడి కిరణ్, నర్సింగ్ కిరణ్, షేక్ గౌస్ పాషా తదితరులు పాల్గొన్నారు.

పెదనెమిల పాఠశాల ప్రహరీ గోడ నిర్మాణానికి పరిశీలన..

ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా దరఖాస్తుల ప్రక్రియను తనిఖీ చేసిన ఎంపీడీవో..

నూతనకల్, నవంబర్ 27 (విజన్ ఆంధ్ర)

మండల పరిధిలోని పెదనెమిల గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కు ప్రహరీ గోడ నిర్మాణం కావాలని జిల్లా కలెక్టర్ కి గ్రీవెన్స్ లో ఇచ్చిన పిటిషన్ పై స్పందిస్తూ శుక్రవారం పాఠశాలను మండల అభివృద్ధి అధికారి సునీత పరిశీలించారు. తదుపరి రిపోర్టు ను పై అధికారులకు పంపించడం





జరుగుతుందని తెలిపారు. అనంతరం దిర్శనపల్లి, లింగంపల్లి,మిర్యాల గ్రామపంచాయతీలలో జరుగుతున్న ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం దరఖాస్తుల నమోదు ప్రక్రియను తనిఖీ చేశారు. అనంతరం మండల కేంద్రంలోని బిసి బాలుర వసతి గృహాన్ని తనిఖీ చేసి విద్యార్థులతో మాట్లాడారు. వసతి గృహంలో విద్యార్థులకు అందిస్తున్న ఆహారాన్ని పరిశీలించి,మేను ప్రకారం ఆహారాన్ని అందిస్తున్నారా లేదా అనే విషయాన్ని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచులు,పంచాయతీ కార్యదర్శులు, డాటా ఎంట్రీ ఆపరేటర్లు,ఆయా గ్రామాల ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్ప దేవాలయంలో ఘనంగా అన్నదాన కార్యక్రమం

మునగాల నవంబర్27 (విజన్ ఆంధ్ర)



స్థానిక శ్రీ హరిహరసుత అయ్యప్ప స్వామి దేవాలయంలో మునగాల గ్రామానికి చెందిన కొమ్ము ఈధరావు – లక్ష్మీ దంపతుల ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం భక్తిశ్రద్ధలతో ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా దేవాలయానికి విచ్చేసిన అయ్యప్ప మాలధారులకు, భక్తులకు నిర్వాహకులు అన్నప్రసాద వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో అయ్యప్ప దేవాలయ కమిటీ చైర్మన్ తడకమల శ్రీనివాసాచారి, గ్రామ పెద్దలు నల్లపాటి శ్రీనివాస్, కాసర్ల కోటేశ్వరరావు, ఓరుగంటి రవి, కాసర్ల వెంకట్ లతో పాటు గురుస్వాములు వల్లోజు వెంకన్న, నవీన్ రెడ్డి, రచ్చ వెంకటేష్, దేవినేని రవికుమార్ తదితరులు పాల్గొన్నారు..

మాదిగ ఉపకులాల (వన భోజనాలు) అలయ్ బలయ్ కార్యక్రమశీ.....

బూర్గుల నాగేందర్ మాదిగ
రాష్ట్ర అధ్యక్షులు TMJF

బీబీనగర్: 27/నవంబర్ (విజన్ ఆంధ్ర)



హైదరాబాద్ లో కలిసి నవంబర్ 29-2026 న పబ్లిక్ గార్డెన్స్ లో జరిగే మాదిగ ఉపకులాల (వన భోజనాలు) అలయ్ బలయ్ కార్యక్రమానికి తెలంగాణ మాదిగ జర్నలిస్ట్ ఫోరం తరుపున హాజరు కావాలని ఆహ్వాన పత్రిక ను అందజేసిన తెలంగాణ రాష్ట్ర తొలి ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ పిడమర్తి రవి ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవిష్యత్ లో అన్ని రంగాల్లో మాదిగ ఉపకులాల ల ప్రాతినిధ్యం పెరిగేందుకు మాదిగలు ఐక్యం కావాలని అందులో భాగంగా జరిగే అలాయ్ బలాయ్ కా ర్యక్రమం లో తెలంగాణ మాదిగ ఉపకులాల జర్నలిస్టులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

జానపహాడ్ లో వ్యక్తి మృతదేహం లభ్యం

పాలకవీడు నవంబర్ 27 (విజన్ ఆంధ్ర)



పాలకీడు మండలం జానపహాడ్ దర్గా గ్రామంలోని వన ప్రాంతంలో నిన్న ఓ మృతదేహాన్ని పోలీసులు గుర్తించారు. విచారణలో మృతుడు హైదరాబాద్ ముషీరాబాద్ పరిధి బాల్కంపూర్కు చెందిన మిర్యాల శ్రీనివాస గుప్తా(55)గా నిర్ధారించారు. సోదరుడు మిర్యాల రాజు గుప్తాకు సమాచారం అందించారు. సోదరుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

అదనపు కలెక్టర్ బాధ్యతలు సీఈఓలు కి అప్పగించాలి.





నల్లగొండ జిల్లా నవంబర్ 27(విజన్ ఆంధ్ర);

ఖాళీగా ఉన్న అదనపు కలెక్టర్ పోస్టులు ఖాళీగా ఉంటే పనులు ఆగిపోతున్నాయి, వాటిని మాకే ఇవ్వండి అని జిల్లా పరిషత్ సీఈఓలు, డీఆర్డీఓలు ప్రభుత్వాన్ని కోరారు.టీజీవో రాష్ట్ర అధ్యక్షులు ఏలూరి శ్రీనివాసరావు నేతృత్వంలో వెళ్లిన బృందం ప్రధాన కార్యదర్శిని కలిసి వినతిపత్రం ఇచ్చింది.మాతో పాటు పిఆర్సి వెంటనే ఇవ్వాలని, బిఆర్కె భవన్ లో హెల్త్ కేర్ ట్రస్ట్ బోర్డు ఆఫీసు పెట్టాలని కూడా అడిగారు.మేము 27 ఏళ్లుగా గ్రామాల్లోనే పనిచేస్తున్నాం, సర్పంచులు, ఎంపీటీసీలు, అధికారులతో రోజూ మాట్లాడేది మేమే, పంచాయతీ పనులు, రోడ్లు, నీళ్లు, పథకాలన్నీ మా కళ్ల ముందే జరుగుతున్నాయని వారు చెప్పారు.పంచాయతీరాజ్ చట్టం ఏమిటో, మున్సిపల్ చట్టం ఏమిటో మాకు బాగా తెలుసు, గ్రామం కావచ్చు, పట్టణం కావచ్చు, స్థానిక సంస్థలను మేము నడపగలమని పంచాయతీరాజ్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి నవీన్ మిట్టల్ కు వివరించారు.ఇప్పటికే 8 జిల్లాల్లో మాలాంటి వాళ్లే అదనపు కలెక్టర్లుగా పనిచేస్తున్నారు, అక్కడ ఎలాంటి ఇబ్బంది లేకుండా పనులు జరుగుతున్నాయని గుర్తుచేశారు.మాకు ఈ బాధ్యతలు ఇస్తే ప్రభుత్వానికి కొత్తగా జీతం ఇవ్వాల్సిన పని లేదు, ఉన్న అధికారులతోనే పని అయిపోతుంది, పరిపాలన కూడా గట్టిగా ఉంటుందని అన్నారు.అందుకే ఆలోచించి మంచి నిర్ణయం తీసుకోవాలని ప్రధాన కార్యదర్శిని కోరారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్నవారు: టీజీవో రాష్ట్ర అధ్యక్షులు ఏలూరి శ్రీనివాసరావు, టీజీవో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.శ్యామ్, సీఈఓ డిప్యూటీ సీఈఓ ఫోరం అధ్యక్షులు, అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు నల్గొండ ఎన్.ప్రేమ్ కరణ్ రెడ్డి, కార్యదర్శి, జాయింట్ కమిషనర్ గ్రామీణాభివృద్ధి మోర శ్రీనివాస్, సహ అధ్యక్షులు జాయింట్ కమిషనర్ నరసింహులు, అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు హనుమకొండ బి.శేషాద్రి, అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు భూపాలపల్లి విజయలక్ష్మి, జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారులు కృష్ణారెడ్డి, వెంకట్ రెడ్డి, చందర్ తదితరులు

కోదాడలో భారీ చోరీ.. జ్యువెలరీ వర్క్‌షాప్‌పై కన్నేసిన దొంగలు!.

పైకప్పు కత్తిరించి లోపలికి ప్రవేశం.

ఐదు కేజీల వెండి, మూడు తులాలకు పైగా బంగారం, నగదు అపహరణ.

రూ.13 లక్షల మేర ఆస్తి దోపిడీ.

కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు.

కోదాడ, నవంబర్ 27 (విజన్ ఆంధ్ర):





కోదాడ పట్టణంలో భారీ చోరీ కలకలం రేపింది. పట్టణంలోని 24వ వార్డు బంగారు షాప్ బజార్‌లో ఉన్న బ్రమరాంబ జ్యువెలరీస్ వర్క్‌షాప్‌ను శుక్రవారం తెల్లవారు జామున దుండగులు లక్ష్యంగా చేసుకుని చోరీకి పాల్పడ్డారు. పక్కా ప్రణాళికతో వచ్చిన దొంగలు వర్క్‌షాప్ పైకప్పును కత్తిరించి లోపలికి ప్రవేశించి విలువైన ఆభరణాలు, నగదును అపహరించారు. ఈ ఘటనలో సుమారు ఐదు కేజీల వెండి, మూడు తులాలకు పైగా బంగారం, రూ. 27 వేల నగదును దుండగులు ఎత్తుకెళ్లినట్లు వర్క్‌షాప్ యజమాని బొద్దోజు మల్లికార్జున చారి తెలిపారు. అపహరణకు గురైన వెండి, బంగారం, నగదు మొత్తం విలువ సుమారు రూ. 13 లక్షలు ఉంటుందని వెల్లడించారు.వర్క్‌షాప్ పైకప్పును కత్తిరించి లోపలికి ప్రవేశించి చోరీకి పాల్పడిన తీరు స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. భారీ మొత్తంలో ఆభరణాలు, నగదు అపహరణకు గురికావడంతో వ్యాపార వర్గాల్లో ఆందోళన నెలకొంది.సమాచారం అందుకున్న కోదాడ డీఎస్పీ శ్రీనివాస్ రెడ్డి, పట్టణ సిఐ శివ శంకర్ నాయక్, ఎస్సై మల్సూర్ లు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. ఘటనకు సంబంధించిన వివరాలు సేకరించి కేసు నమోదు చేశారు. చోరీకి పాల్పడిన దుండగులను గుర్తించేందుకు పోలీసులు దర్యాప్తు చేపట్టారు. పట్టణ నడిబొడ్డున ఉన్న జ్యువెలరీ వర్క్‌షాప్‌లోనే భారీ చోరీ జరగడంతో ఈ ఘటన ప్రాధాన్యత సంతరించుకుంది.

డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణంలో మహిళలు, యువత భాగస్వాములు కావాలి

- ఏసిడీపీవో శ్రీవాణి ఆధ్వర్యంలో తిరుమలగిరి (సాగర్) మండల కేంద్రంలో 'డ్రగ్స్ ఫ్రీ ఇండియా' పై అవగాహన కార్యక్రమశీ

తిరుమలగిరి (సాగర్) నవంబర్ 27(విజన్ ఆంధ్ర):



మత్తుపదార్థాల నిర్మూలన ఆరోగ్యకరమైన సమాజ స్థాపన లక్ష్యంగా మహిళా అభివృద్ధి శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం తిరుమలగిరి సాగర్

మండల కేంద్రంలో 'డ్రగ్స్ ఫ్రీ ఇండియా' (నశా ముక్త్ భారత్ అభియాన్) అవగాహన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.

అంగన్వాడీ ఏసిడిపిఓ శ్రీవాణి పర్యవేక్షణలో జరిగిన కార్యక్రమంలో మత్తుపదార్థాల వినియోగం వల్ల కలిగే శారీరక, మానసిక అనర్థాలపై ప్రజలకు, యువతకు, మహిళలకు విస్తృతంగా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏసిడిపిఓ మాట్లాడుతూ.. యువత చెడు వ్యసనాలకు బానిసలై తమ బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని హితవు పలికారు. పిల్లల ప్రవర్తనపై తల్లిదండ్రులు ఎప్పటికప్పుడు దృష్టి సారించాలని, గ్రామాల్లో గంజాయి లేదా ఇతర మత్తుపదార్థాల విక్రయాలు, వినియోగం జరిగితే వెంటనే సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని సూచించారు.

అనంతరం అంగన్వాడీ టీచర్లు, ఆయాలు, కిశోర బాలికలు, స్థానిక మహిళలతో కలిసి "డ్రగ్స్ రహిత సమాజాన్ని నిర్మిస్తాం" అంటూ ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ సూపర్వైజర్లు శృతి, యాదమ్మ,విజయలక్ష్మి,ఆశా వర్కర్లు, కిశోర బాలికలు, మహిళా సంఘాల సభ్యులు మరియు స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు

నూతన పట్టు వస్త్రాలంకరణం మహోత్సవం కార్యక్రమంలో పాల్గొని చిన్నారులను ఆశీర్వదించిన బి.ఆర్.ఎస్ దేవరకొండ నియోజకవర్గం నాయకులు వడ్త్య రమేష్

కొండమల్లేపల్లి నవంబర్ 27 (విజన్ ఆంధ్ర):-



కొండ మల్లేపల్లి మండలం కేంద్రంలో జనప్రియ గార్డెన్ లో నిర్వహించినఅజ్మాపురం గ్రామ పంచాయతీ చెందిన ఇరగదిండ్ల సతీష్ - రాజేశ్వరి లా పుత్రిక పుత్రుడు నవ్య శ్రీ - భావ్యాంశ్ లా నూతన పట్టు వస్త్రాలంకరణం మహోత్సవం కార్యక్రమంలో పాల్గొని చిన్నారులు ఆశీర్వదించిన బి ఆర్ ఎస్ దేవరకొండ నియోజకవర్గం నాయకులు వడ్త్య రమేష్ ఈ కార్యక్రమంలో బి ఆర్ ఎస్ నాయకులు అజ్మాపురం మాజీ సర్పంచ్ ఇరగదిండ్ల రామకృష్ణ, సాంబయ్య, యాదగిరి ,నోముల మహేష్,కొర్ర కోటేష్,రామాంజనేయులు, కంబాలపల్లి చిరంజీవి, తెలంగాణ ఉద్యమ కారులు వరకుప్పల నగేష్ ,ఎల్లయ్య, మాచర్ల యాదయ్య ,బొమ్ము వెంకటయ్య ,తదితరులు పాల్గొన్నారు

పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసిన :డీఎస్పీ ప్రసన్న కుమార్

తుంగతుర్తి,నవంబర్ 27(విజన్ ఆంధ్ర);



పోలీస్ స్టేషన్‌ను సూర్యాపేట డీఎస్పీ ప్రసన్న కుమార్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ ప్రసన్న కుమార్ మీడియాతో మాట్లాడుతూ పోలీస్ శాఖ ఫిర్యాదుదారులకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ, ప్రతి ఒక్కరితో స్నేహపూర్వకంగా వ్యవహరించాలని సూచించారు. ప్రజలకు మరింత చేరువయ్యేలా, ఫిర్యాదులపై స్పందించి అవసరమైన సందర్భాల్లో నేరుగా బాధితుల ఇళ్లకు వెళ్లి వివరాలు సేకరించి కేసుల నమోదు ప్రక్రియ చేపట్టి,ఎక్కడ ఏ ఘటన జరిగినా పోలీసులు తక్షణమే స్పందించేలా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. పాత నేరస్థుల కదలికలపై నిఘా ఉంచామని,విజిబుల్ పోలీసింగ్ పెట్రోలింగ్ ముమ్మరం చేయాలని బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించ కుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. జనరల్ విజిట్‌లో భాగంగా పోలీస్ స్టేషన్ పనితీరు, ప్రజలకు అందిస్తున్న సేవలను పరిశీలించినట్లు డీఎస్పీ తెలిపారు. ఈ కార్యక్రమంలో తుంగతుర్తి సీఐ ఉపేందర్ రావు,ఎస్ ఐ క్రాంతి కుమార్, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

ఎస్ఐ పరీక్షకు పటిష్ట బందోబస్తు ఏర్పాట్లు : ఎస్పీ శరత్ చంద్ర పవార్

నల్లగొండ జిల్లా నవంబర్ 27(విజన్ ఆంధ్ర);



ముందుగానే పరీక్షా కేంద్రాలకు చేరుకొని ప్రశాంత వాతావరణంలో పరీక్ష రాయాలని జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ అన్నారు.ఎస్ఐ ప్రిలిమినరీ రాత పరీక్షకు జిల్లాలో పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 35 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేయగా 13765 మంది అభ్యర్థులు హాజరుకానున్నారని వెల్లడించారు.నల్లగొండ, నార్కట్ పల్లి మండలాల్లో కేంద్రాలను ఏర్పాటు చేశామని, అభ్యర్థులకు ఇబ్బందులు లేకుండా ఆర్టీసీతో సమన్వయం చేసుకొని బస్సుల సౌకర్యం పెంచామని పేర్కొన్నారు.పరీక్ష ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు జరుగుతుందని, ఉదయం 9 గంటల నుంచే బయోమెట్రిక్ నమోదు ప్రారంభమవుతుందని, అందుకే ముందుగానే చేరుకోవాలని సూచించారు.ప్రతి కేంద్రం వద్ద తగినంత పోలీసు సిబ్బందితో నిఘా ఉంటుందని, కేంద్రాలు సీసీ కెమెరాల పర్యవేక్షణలో ఉంటాయని తెలిపారు.పరీక్ష ప్రారంభానికి గంట ముందే హాలులోకి అనుమతిస్తారని, ప్రారంభమైన తర్వాత ఒక్క నిమిషం ఆలస్యమైనా అనుమతించరని, పరీక్ష పూర్తయ్యే వరకు కేంద్రాల వద్ద జిరాక్స్ కేంద్రాలు తెరవడానికి అనుమతి ఉండదని, సెక్షన్ 163 బీఎన్ఎస్ఎస్ అమలులో ఉంటుందని స్పష్టం చేశారు.మొబైల్ ఫోన్లు, స్మార్ట్ వాచ్ లు, బ్లూటూత్ పరికరాలు, పుస్తకాలు, బ్యాగులు, నగలు కేంద్రంలోకి అనుమతించరని, నలుపు లేదా నీలం బాల్ పాయింట్ పెన్, హాల్ టికెట్ మాత్రమే తీసుకెళ్లాలని సూచించారు.పరీక్ష 200 మార్కులకు 200 ప్రశ్నలతో ఉంటుందని, తప్పు సమాధానాలకు నెగెటివ్ మార్కింగ్ ఉంటుందని, హాల్ టికెట్ పై ఫోటో అతికించి సంతకం చేయాలని, ముందు రోజే కేంద్రాన్ని సందర్శించి మార్గం తెలుసుకోవాలని చెప్పారు.అభ్యర్థులు ఆందోళన లేకుండా ఆత్మవిశ్వాసంతో పరీక్ష రాయాలని, నిబంధనలు ఉల్లంఘించే వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

ఎలక్ట్రిక్ బైక్ లదే హవా

రానున్న రోజుల్లో మరింత పెరగనున్న అమ్మకాలు వినియోగదారులకు మెరుగైన సేవలందించాలి నల్లమోతు సిద్ధార్థ

మిర్యాలగూడ, నవంబర్ 27 (విజన్ ఆంధ్ర);



మధ్య ప్రాచ్యంలో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల దృష్ట్యా పెట్రోల్, డీజిల్ రెట్లు రోజురోజుకూ బాగా పెరిగిపోతున్నాయి. అంతేగాకుండా, వాతావరణ కాలుష్య నియంత్రణలో భాగంగా ఎలక్ట్రిక్ బైక్ ల హవా కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో వినియోగదారులు ఎలక్ట్రిక్ బైకుల కొనుగోలు వైపునకు మొగ్గు చూపుతున్నారు. రానున్న రోజుల్లో ఎలక్ట్రిక్ బైకుల అమ్మకాలు మరింత పెరగనున్నాయని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు నల్లమోతు సిద్ధార్థ అభిప్రాయపడ్డారు.

మిర్యాలగూడ పట్టణంలోని సాగర్ రోడ్డులో ఇటీవల నూతనంగా ప్రారంభించబడిన ఎలక్ట్రికల్ వెహికిల్ షోరూమ్‌ను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా షోరూమ్ నిర్వాహకులతో మాట్లాడి ఎలక్ట్రిక్ వాహనాల మోడల్స్, వాటి ప్రత్యేకతలు, ధరలు, వినియోగదారులకు అందిస్తున్న సేవల గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. నూతనంగా వ్యాపార రంగంలో అడుగుపెట్టిన నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలియజేసి, వ్యాపారం మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు.వినియోగదారులకు మెరుగైన సేవలందించాలని నిర్వాహకులు ఫణి కుమార్ కు సూచించారు. వారి వెంట పిన్నబోయిన శ్రీనివాస్ యాదవ్, వినోద్, ఎండి.షోయబ్, తదితరులు ఉన్నారు.

పోలీస్ సేవలో జవాబుదారీతనం, ప్రజలకు మెరుగైన సేవలే లక్ష్యం

-- ఎస్పీ వార్షిక తనిఖీ

బీబీనగర్ నవంబర్ 27(విజన్ ఆంధ్ర):



యాదాద్రి భువనగిరి జిల్లా ఎస్పీ శ్రీ అక్షాన్ష్ యాదవ్ ఐ.పి.ఎస్ బీబీనగర్ పోలీస్ స్టేషన్‌ను వార్షిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ముందుగా పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌ఓ సూర్య నాయక్ స్టేషన్ సిబ్బందిని ఎస్పీ కి పరిచయం చేశారు. అనంతరం ఎస్పీ పోలీస్ స్టేషన్ పరిసరాలను పరిశీలించి, వివిధ కేసుల్లో స్వాధీనం చేసుకున్న వాహనాలను తనిఖీ చేశారు. పెట్రో కారును పరిశీలించి, అందులో అందుబాటులో ఉన్న పోలీస్ విధులకు సంబంధించిన పరికరాలు, వస్తువులను తనిఖీ చేస్తూ వాటి వినియోగం, నిర్వహణపై సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం లాకప్ గదులు, స్టేషన్ రైటర్ గదిని పరిశీలించి, వృద్ధులు, దివ్యాంగుల సౌకర్యార్థం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన పిటిషన్ కౌంటర్‌ను ప్రారంభించారు. అనంతరం ఎస్‌హెచ్‌ఓ గదిలో వివిధ రికార్డులను పరిశీలించి జనరల్ డైరీ, క్రైమ్ రికార్డులు, సైబర్ క్రైమ్ కేసులు, బాధితులకు నగదు రీఫండ్‌కు సంబంధించిన వివరాలు, ప్రమాద కేసులు, ప్రజల నుంచి స్వీకరించిన ఫిర్యాదులు, ప్రమాదాలు ఎక్కువగా జరిగే ప్రాంతాలు (యాక్సిడెంట్ ప్రోన్ ఏరియాస్), పెండింగ్ ట్రయల్ కేసులు, కోర్టు డిస్పోజల్స్, నాన్ బెయిలబుల్ వారెంట్లు, సమన్ల జారీ, అమలుకు సంబంధించిన వివరాలను సమీక్షించారు. విలేజ్ పోలీస్ ఆఫీసర్ లను ఒక్కొకరిగా పిలిచి గ్రామాల సందర్శన మరియు ప్రజలతో వారి సంభాషణ వంటి విషయాలపై విచారించారు.అలాగే డయల్ 112 కాల్స్‌కు స్పందిస్తున్న సమయం డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల నమోదు, వాటిపై తీసుకుంటున్న చర్యలను సమీక్షించారు.ఈ సందర్భంగా ఎస్పీ గారు సిబ్బందికి పలు సూచనలు చేస్తూ, డయల్ 112కు వచ్చే ఫిర్యాదులపై తక్షణమే స్పందించి రిస్పాన్స్ టైమ్‌ను మరింత తగ్గించాలని, ప్రజలకు పోలీస్ సేవలు వేగంగా అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సైబర్ నేరాలు, మహిళల భద్రత, పోక్సో చట్టం, ఆన్‌లైన్ గేమింగ్ వల్ల కలిగే అనర్థాలపై ప్రజలకు విస్తృత స్థాయిలో అవగాహన కల్పించాలని సూచించారు.ముఖ్యంగా సోషల్ మీడియా వేదికలను సమర్థవంతంగా వినియోగించుకుంటూ సైబర్ నేరాల పట్ల అప్రమత్తత, మహిళలు మరియు పిల్లల భద్రత, ఆన్‌లైన్ మోసాల నివారణపై నిరంతరం అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రతి ఫిర్యాదుదారుడితో మర్యాదపూర్వకంగా వ్యవహరిస్తూ, వారి సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు కృషి చేయాలని, విధి నిర్వహణలో క్రమశిక్షణ, జవాబుదారీతనం, పారదర్శకత పాటించాలని సిబ్బందికి సూచించారు.ఈ వార్షిక తనిఖీలో భువనగిరి డిఎస్పీ బి.రవీందర్,ఎస్‌హెచ్‌ఓ సూర్య నాయక్, ఎస్ఐలు తేజం రెడ్డి, కృష్ణయ్య మరియు పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

అక్కినేపల్లి హైస్కూల్‌కు రెండు సీలింగ్ ఫ్యాన్లు విరాళం

నార్కట్‌పల్లి, నవంబర్ 27(విజన్ ఆంధ్ర):



విద్యార్థుల సౌకర్యార్థం తాము చదువుకున్న పాఠశాలకు తమవంతు సహకారం అందించేందుకు అక్కినేపల్లి గ్రామానికి చెందిన ప్రజాప్రతినిధులు ముందుకొచ్చారు. నార్కట్‌పల్లి మండలం అక్కినేపల్లి గ్రామంలోని ప్రభుత్వ హైస్కూల్‌కు గ్రామానికి చెందిన 3వ వార్డు సభ్యుడు ఎస్.కె. షరీఫ్, 4వ వార్డు సభ్యుడు అక్కినేపల్లి సత్యనారాయణ, 5వ వార్డు సభ్యుడు, ఉపసర్పంచ్ మిడిదొడ్డి సాయి కలిసి రెండు సీలింగ్ ఫ్యాన్లను విరాళంగా అందజేశారు.తాము విద్యనభ్యసించిన పాఠశాల అభివృద్ధికి, విద్యార్థుల సౌకర్యానికి తమవంతు సహకారం అందించడం సంతోషంగా ఉందని వారు పేర్కొన్నారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నడింపల్లి వెంకటేశ్వర్లు వారిని అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు అయ్యప్ప రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, ఇతర ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు భువనగిరి పట్టణంలో ఎమ్మెల్యే కుంభం పర్యటన

భువనగిరి నవంబర్ 27(విజన్ ఆంధ్ర):



మధ్యానం 12:30 గంటలకు భువనగిరి మండలానికి సంబంధించిన ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు భువనగిరి క్యాంప్ కార్యాలయంలో ప్రొసీడింగ్స్ అందజేస్తారు.మధ్యానం 2:00లకు భువనగిరి పట్టణం నందు గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్ ను జిల్లా కలెక్టర్ తో కలిసి సందర్శన మరియు సెంట్రల్ ఆక్సిజన్ ప్లాంట్ ను ప్రారంభిస్తారు.

మధ్యాహ్నం 03:00గ. లకి జిల్లా కలెక్టరేట్ లోని మీటింగ్ హాల్ నందు ముస్లిం మైనారిటీ, మహిళలకి కుట్టు మిషన్లు మరియు తురుక కాషాకు టూల్ కిట్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొంటారు.

తెలంగాణ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ ను మర్యాదపూర్వకంగా కలిసిన ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి.....

మిర్యాలగూడ, నవంబర్ 27 (విజన్ ఆంధ్ర);



తెలంగాణ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ గా నూతనంగా బాధ్యతలను స్వీకరించినటువంటి బిఎం. సందీప్ కుమార్ ను ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి శుక్రవారం నాడు హైదరాబాదులో మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా రాజకీయ విషయాల గురించి చర్చించడం జరిగింది....